
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 10 నవంబరు 2024





చేర్రెడ్డి మంజులారెడ్డి ఉండవల్లి శ్రీదేవి సజ్జా హేమలత చిలకలపూడి పాపారావు

నైట్ షెల్టర్లు.. నామమాత్రమే



గుంటూరు మార్కెట్ ఎదుట డివైడర్‌పై నిద్రిస్తున్న నిరుపేదలు

చలికి వణుకుతూ.. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఆకలితో అలమటిస్తూ.. రోగాలతో అల్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాల భయంతో ఎందరో అభాగ్యులు, అనాథలు, దిక్కులేని వారు ఎందరో రోడ్డు పక్కల ఆశ్రయం పొందుతూ ఉంటారు. పగలు ఏదోలా కాలం గడిపినా రాత్రిళ్లు వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆశ్రయం కల్పించి ఆదరించాలి. సుప్రీంకోర్టు కూడా గతంలో నిరాశ్రయుల ఆశ్రయం కోసం ప్రతీ మున్సిపల్ కేంద్రంలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పట్టణాల్లో కొన్ని దగ్గర్ల పేరుకు మాత్రమే నిరాశ్రయుల వసతిగృహాలను ఏర్పాటు చేయగా, కొన్ని దగ్గర్ల అసలు వాటి ఊసే లేదు. మున్సిపాలిటీల్లో కొన్ని దగ్గర్ల మెప్మా ఆధ్వర్యంలో మరికొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నైట్‌షెల్టర్లు కొనసాగుతున్నా అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఇక్కడ ఆశ్రయం పొందే అభాగ్యుల కంటే రోడ్లపై ఉండేవారే వందల్లో ఉంటున్నారు. వారం రోజులుగా వీస్తున్న చలి గాలులకు ఇబ్బందులు పడుతూ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రిళ్లు ఎందరో నిద్రిస్తున్నారు.



గుంటూరు: అరండల్ పేట ఫస్ట్ లైన్‌లో ఉన్న నైట్ షెల్టర్ సెంటర్లో మూసి ఉన్న ఆఫీస్

- కనీస సదుపాయాలు కరువు
- నిర్వహణకు నిధుల కొరతని నిర్లక్ష్యం
- రోడ్ల పక్కన, డివైడర్లపై నిరాశ్రయుల ఆశ్రయం
- నిద్రకు.. ఆకలికి అలమటిస్తున్న అభాగ్యులెందరో
- చాలాప్రాంతాల్లో మూత.. కొన్నిచోట్ల పేరుకు మాత్రమే ఏర్పాటు
- సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా పట్టించుకోని పుర పాలకులు, అధికారులు



గుంటూరు: ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల నైట్ షెల్టర్

తెనాలి: బాలాజీరావుపేటలో నిరుపయోగంగా ఉన్న నైట్ షెల్టర్



(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

గూడు లేని.. ఆదరించే వారు లేని అభాగ్యుల ఆశ్రయం కోసం పట్టణాల్లో నైట్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఆశ్రయం కోసం వచ్చే వారికి భోజనం అందించడంతో పాటు రాత్రిళ్ల నిద్రించే సౌకర్యాలు కల్పించాలి. అయితే జిల్లాలోని మున్సిపాల్టీల్లో పేరుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పేరుకు నైట్‌షెల్టర్లు ఉన్నా అక్కడ ఆశ్రయం పొందేందుకు అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. సరైన సౌకర్యాలు లేవని, అపరిశుభ్రత తదితర కారణాలతో కొందరు, ఈ తెలియక కొందరు నిరాశ్రయుల వసతిగృహాలకు ఆదరణ తగ్గుతుంది. దీంతో చాలామంది రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లపైనే చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నైట్‌షెల్టర్లపై అవగాహన పెంచి వాటి సేవలను నిర్భాగ్యులందరికీ అందేలా చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యాచకులు, ఆదరించేవారు లేని ఒంటరివారు, ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే వారు దుర్భర పరిస్థితుల మధ్య ఫుట్‌పాత్‌లు, అండర్ పాస్‌ల్లో, పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. దాతలు ఎవరైనా భోజనం అందిస్తూ తింటూ, వారిచ్చే దుప్పట్లు కప్పుకుని రోడ్లపైనే కాలం గడుపుతుంటారు. ప్రతీ మున్సిపాల్టీలోనూ నైట్ షెల్టర్లు కొనసాగాల్సి ఉన్నా అధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి పట్టించుకోవడంలేదు. కొన్ని దగ్గర్ల నిధుల కొరతతో మూసేశారు. షెల్టర్ జోన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలాదగ్గర్ల ఈ వసతిగృహాలు మూతపడ్డాయి. రోడ్లపై ఆశ్రయం పొందేవారు వ్యక్తిగత శుభ్రత లోపించి రోగాల బారిన పడుతున్నారు.

(మిగతా 6వ పేజీలో..)

దాతల ఔదార్యంతో దుప్పట్లు

వర్షాకాలం, చలికాలంలో చలిగాలులకు రోడ్లపై నిద్రించే నిరాశ్రయులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. దోమలతో కంటి మీద కునుకు ఉండదు. రోడ్డు పక్కన చలికి వణుకుతూ కనిపించే వారిని చూసిన వారు మానవత్వంతో స్పందించి ఆహారం, దుప్పట్లు వంటివి అందజేస్తుంటారు. ఇలాంటివారు అందచేసే దుప్పట్లతో చలిగాలులు, దోమల నుంచి రక్షణ పొందుతుంటారు. మళ్లీ కొత్తగా ఎవరైనా దాతలు ఇచ్చే వరకు గతంలో అందజేసిన దుప్పట్లతోనే కాలం వెళ్లదీస్తూ ఉంటారు.

అయ్యో పాపం

గతంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కుల్లో నిర్భాగ్యులు రాత్రిళ్లు ఆశ్రయం పొందేవారు. అధికారులు వీరిని రానీయకుండా కట్టడి చేస్తున్నారు. ఎవరైనా పార్కులు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో నిద్రిస్తున్నా పోలీసులు తరుముకుంటున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీరంతా రోడ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇలా రోడ్లపై ఆశ్రయం పొందే పురుషుల కంటే మహిళలు, బాలికల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నిరాశ్రయుల్లో వృద్ధులు ఎక్కువగా ఉండడంతో వారి యాతన చెప్పనలివి కాకుండా ఉంది.

పదవుల పండుగ

- 3 జిల్లాలు.. 9 మందికి పదవులు
- కష్టానికి, త్యాగానికి అధిష్ఠానం గుర్తింపు
- గుంటూరు నుంచి శ్రీదేవి, దేగల, మన్నవ, చిల్లపల్లిలకు చాన్స్
- పల్నాడు జిల్లా నుంచి మంజులారెడ్డి, గోనుగుంట్లకు అవకాశం
- బాపట్ల నుంచి పాపారావు, రాజశేఖర్‌బాబు, హేమలతలకు అందలం

గుంటూరు, బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న నాయకులు పండుగ చేసు కుంటున్నారు. ఐదు నెలలుగా ఎప్పుడు.. ఎవరికి.. ఎలా పదవులు వస్తాయోనని ఎదురుచూస్తోన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తీపికబురు చెప్పారు. సెప్టెంబరులో ప్రకటించిన తొలి జాబితాలో కొందరికి అవకాశం దక్కగా మిగిలిన వారు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చంద్రబాబు పెద్దసంఖ్యలో నామినేటెడ్ పదవులను ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో తొమ్మిది మందికి పదవుల పందేరం జరిగింది. కష్టనష్టాలకోర్చి, త్యాగాలకు వెనుదీయక పార్టీ కోసం పని చేసిన నేతలు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తగిన గౌరవాన్ని కల్పిస్తోంది. తాజా జాబితాలో గుంటూరు జిల్లా నుంచి తాడికొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, మంగళగిరికి చెందిన జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన టీడీపీ మహిళా నేత మంజులారెడ్డి, నరసరావుపేటకు చెందిన టీడీపీ దివ్యాంగ విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లాలో రేపల్లెకి చెందిన చిలకలపూడి పాపారావు, బాపట్లకు చెందిన టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబు, చీరాలకి చెందిన టీడీపీ నాయకురాలు సజ్జా హేమలతలను పదవులు వరించాయి. కాగా సార్వత్రిక ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల దాడులు, దౌర్జన్యాలకు ఎదురు నిలిచి తీవ్రంగా గాయాలపాలైన మంజులారెడ్డికి చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బాపట్ల ఎంపీ సీటు అభ్యర్థిత్వాన్ని ఆశించిన సలగల రాజశేఖర్‌బాబు కొన్ని సమీకరణాల నేపథ్యంలో పార్టీ ఆయనకు సీటు ఇవ్వలేకపోయింది. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. రెండో జాబితాలో బాపట్ల జిల్లాలో ముగ్గురిని నామినేటెడ్ పోస్టులు వరించగా రెండు టీడీపీ, ఒకటి జనసేన నేతలు దక్కించుకున్నారు. వీరిలో బాపట్లకు చెందిన సీనియర్ టీడీపీ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సలగల రాజశేఖరబాబును కీలకమైన బావుడా ఛైర్మన్ పదవి వరించింది. చీరాలలో టీడీపీ గెలుపులో తనవంతు సహకారం అందించిన బీసీ(దేవాంగ) సామాజికవర్గానికి చెందిన సజ్జా హేమలతకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చింది. ఇక రేపల్లెకు చెందిన మత్స్యకార సామాజికవర్గానికి చెందిన చిలకలపూడి పాపారావుకు కూడా పదవి దక్కింది. ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పదవి డాక్టర్ పెదపూడి విజయ్‌ను వరించగా ఈయన ప్రస్తుతం పర్చూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కానీ ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో పార్టీ ప్రకటించిన జాబితాలో ఈ పదవిని ఒంగోలు కోటాలో చూపించారు.

ఇప్పటికే పలువురికి పదవులు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక విడతలో వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించింది. ఆ తర్వాత టీటీడీ పాలక మండలిలో పలువురుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పలువురికి పదవులు దక్కాయి. సెప్టెంబరు 24న తొలివిడుత నామినేటెడ్ పదవుల జాబితాలో పిల్లి మాణిక్యరావుకు ఏపీలిడ్‌క్యాప్ ఛైర్మన్ పదవి వరించగా, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి మంగళగిరికి చెందిన నందం అబద్ధయ్యను వరించింది. అమరావతి ఉద్యమంలో కీలకంగా పనిచేసిన రాయపాటి శైలజతోపాటు మంగళగిరికి చెందిన పార్థసారథి, తెనాలికి చెందిన కోటేశ్వరరావులకు తొలి జాబితాలో స్థానం దక్కింది. ఇటీవల విడుదలైన టీటీడీ పాలక మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తుళ్లూరుకు చెందిన నన్నపనేని సదాశివరావులను సభ్యులుగా నియమితులయ్యారు.

వీర వనితకు అందలం



రెంటచింతల: గడచి న సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల అరాచకాలను పురుషులే తట్టుకోలేకపోయారు. అయితే ఓ మహిళ పోలింగ్ రోజున వైసీపీ మూకల గొడ్డలి దాడితో రక్తం కారుతున్నా వైసీపీ అక్రమాలను అడ్డుకుని వీర వనితగా రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. ఆమే రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చేర్రెడ్డి మంజులరెడ్డి. చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్(హస్తకళాభివృద్ధి) సొసైటీ ఛైర్మన్ పదవి ఆమెను వరించింది. రెంటాల గ్రామంలో మే 13న జరిగిన పోలింగ్ రోజున వైసీపీ మూకల అరాచకాలకు అడ్డుగా నిలిచి వీరోచితంగా పోరాడి బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్‌గా కూర్చొన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఆమెపై వైసీపీ వర్గీయులు రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో తీవ్రంగా గాయపరిచారు. అయినా వెనక్కి తగ్గని ఆమె రక్తపు గాయాలతోనే బూత్‌లో కూర్చొని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నారు. మాచర్లలో ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డి గెలవాలి, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పట్టుదలగా నిలిచారు. పోలింగ్ అనంతరమే ఆమె ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. పార్టీ కోసం ఆమె అకుంఠిత దీక్ష, పట్టుదలను చంద్రబాబు గుర్తించి పదవి కట్టబెట్టారు.

పదవులు ఇలా..

- ఉండవల్లి శ్రీదేవి ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్
- డేగల ప్రభాకర్ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- మన్నవ మోహనకృష్ణ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్
- చిల్లపల్లి శ్రీనివాసరావు ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- మంజులారెడ్డి ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఛైర్మన్
- గోనుగుంట్ల కోటేశ్వరరావు ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్
- చిలకలపూడి పాపారావు ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- సజ్జా హేమలత ఏపీ హ్యాండ్‌లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్
- సలగల రాజశేఖర్‌బాబు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(బావుడా) ఛైర్మన్



మన్నవ మోహనకృష్ణ దేగల ప్రభాకర్ చిల్లపల్లి శ్రీనివాసరావు సలగల రాజశేఖరబాబు గోనుగుంట్ల కోటేశ్వరరావు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- మూడు జిల్లాల నుంచి పలువురు ఎంపిక
- ఈ నెల 11న విజయవాడలో అవార్డుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 9: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డులు పంపిణీ చేయనున్నారు.

● **పాఠశాల విభాగంలో** : బాపట్ల జిల్లా నుంచి కోట వెంకటశ్రీనివాసరావు(హెచ్ఎం జడ్పీహెచ్ఎస్, చక్రాయపాలెం, అద్దంకి మండలం), గోనేళ్ళ శేషవర లక్ష్మి(స్కూల్ అసిస్టెంట్ జడ్పీహెచ్ఎస్ ఈపూరుపాలెం చీరాల), పవని భానుచంద్రమూర్తి(ఏఆర్ఎం హైస్కూల్ పేరాల, చీరాల మండలం), కర్పూరపు బిజిలికుమార్ (ఎంపీపీఎస్, బలుసులపాలెం, చెరుకుపల్లి), గుంటూరు జిల్లా నుంచి డాక్టర్ చెన్నంశెట్టి రమేష్(ఎంపీయూపీ స్కూల్, మామిళ్ళపల్లి, పొన్నూరు), పెనుమూడి ముత్యం జయరావు(ఎంపీపీఎస్, కొల్లిపర)

● **ఇంటర్ విద్యలో**: బీ సౌజన్య (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరు), ఆర్‌వీఎస్ ప్రసాద్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల దుర్గి), ఎస్ శేషుకుమారి (ప్రిన్సిపల్, ప్రభుత్వ జూ నియర్ కళాశాల పర్చూ రు).

● **టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో**: పీ నీలిమ (ఎంటీటీఎస్ పాలిటెక్నిక్‌కళాశాల గుంటూరు)

● **ఉన్నత విద్యావిభాగం**: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఆచార్య ఎం తిరుపతిరావు, ఆచార్య అశోక్‌కుమార్, ఆచార్య పూర్ణచంద్రరావు, డాక్టర్ పద్మజరావు, ఆచార్య డీ రామచంద్రన్, డాక్టర్ బిల్‌క్యూస్, డాక్టర్ ఎస్ విష్ణువర్ధన్, డాక్టర్ జీ మోహన్‌నాయుడు



పవని భానుచంద్రమూర్తి (పేరాల) గోనేళ్ళశేషవరలక్ష్మి (ఈపూరుపాలెం) డాక్టర్ చెన్నంశెట్టి రమేష్ (మామిళ్ళపల్లి)

కళాశాలను కాపాడుకున్నారు
- మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేరుకున్న వైనం
- దాతల సహకారంతో ఉచితంగా మధ్యాహ్న భోజనం
- ఇంటింటికీ వెళ్లి విజయాలు వివరిస్తున్న అధ్యాపకులు

ఉత్సాహంగా బేస్‌బాల్ పోటీలు
- 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల రాక
- యనమదల జడ్పీ హైస్కూల్‌లో తలపడుతున్న జట్లు

8

బోరుగడ్డ తీరు మళ్లీ వివాదాస్పదం
- పోలీస్‌స్టేషన్‌లోనే రిమాండ్ ఖైదీకి బల్లపై నిద్ర
- అరండల్‌పేట స్టేషన్ సీఐ శ్రీనివాసరావుపై వేటు

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు
- పాత డొక్కు బస్సుల స్థానంలో వినియోగం
- గుంటూరు డిపోలకు 200 బస్సులకు ప్రతిపాదన
- మంగళగిరి, విజయవాడ, రాజధానికి రాకపోకలు
- మంగళగిరి, గుంటూరులో హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు

6

సర్కిల్స్ విభజన.. మారిన స్వరూపాలు
- గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్‌గా ప్రాధాన్యం
- ప్రస్తుతం రెండు, మూడు డివిజన్‌లకే పరిమితం

గఘన యానం

- విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్
- పున్నమిఘాట్ వేదికగా అద్భుత విన్యాసాలు
- ట్రయల్ రన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, సాగర్ నుంచి శ్రీశైలం వరకూ..
- సీఎం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరుల ప్రయాణం
- ట్రయల్ రన్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో రంగుల వెలుగులు

“ రన్‌వేలు అవసరం లేదు.. విమానాశ్రయాలు అంతకంటే అవసరం లేదు.. నీరుంటే చాలు.. నేరుగా ల్యాండ్ అయిపోతుంది.. టేకాఫ్ అవుతుంది.. ఒక జెట్టీ, వాటర్ డ్రోమ్ ఉంటే చాలు.. రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయి.. అంతే వేగంగా కిందకు దిగిపోతుంది.. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఈ సరికొత్త సీప్లేన్ ట్రయల్ రన్ శనివారం అద్భుతంగా జరిగింది. పున్నమిఘాట్ వేదికగా, సుందరమైన కృష్ణాతీరంలో, ప్రకృతి అందాల నడుమ అటూ ఇటూ తిరిగిన ప్లేన్ విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. పర్యాటకంపై సీఎం చంద్రబాబు ప్రసంగం, సప్తవర్ణాలను విరజిమ్మిన బాణసంచా పేలుళ్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ”



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పున్నమిఘాట్ వద్ద కృష్ణాతీరంలో శనివారం సీప్లేన్ ట్రయల్ రన్ అద్భుతంగా జరిగింది. ఘాట్‌లోని వాటర్ జెట్టీ వద్ద ఉదయం 10.05 గంటలకు సీప్లేన్‌ను నిలిపి ఉంచి, జెట్టీ వెనుక భాగంలో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్ధనరెడ్డితో పాటు ఎంపీ కేశినేని చిన్ని, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్, ఐఅండ్ఐ రాష్ట్ర, కేంద్ర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమం అయిపోగానే, సందర్శకులు వీక్షించేలా టెంట్ తెరలు తొలగించారు. సరిగ్గా 12.45 గంటలకు సీప్లేన్ సర్వీసు కృష్ణానది నుంచి బయల్దేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ఆహ్వానితులు ప్లేన్‌లోకి ఎక్కారు. ప్లేన్‌లోకి ఎక్కేముందు చంద్రబాబు అభివాదం చేయటంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

గ్రాండ్ వెల్కమ్

సీప్లేన్ డెమో లాంచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభ సూచికగా భవానీ ద్వీపం సమీపంలో కృష్ణానదిపై గ్రాండ్ ఫైర్‌వర్క్స్ జరిపారు. పడవలపై పెద్ద ఎత్తున ధ్వనిచేస్తూ సప్తవర్ణాలను ఆకాశంలోకి విరజిమ్మారు.



సీప్లేన్ సాగిందిలా..

కృష్ణానదిలో తూర్పు వైపునకు కదిలిన సీప్లేన్, ఆ వెంటనే యూటర్న్ తీసుకుని భవానీ ద్వీపం చెంతకు వెళ్లింది. ద్వీపం టవర్ సమీపంగా వెళ్లి, అక్కడి నుంచి వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. ప్రకాశం బ్యారేజీతో పాటు నాగార్జున సాగర్, పులిచింతల డ్యామ్‌ల మీదుగా శ్రీశైలం డ్యామ్ వరకు ఈ సీప్లేన్ వెళ్లింది.



జపాన్ సకురా సైన్స్ ప్రాజెక్టుకు విజ్ఞాన్ అధ్యాపకులు ఎంపిక



ఎంపికైన అధ్యాపకులతో వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్టు 2024కు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ సంపత్‌కుమార్, డాక్టర్ చింతగుంట అంజనిదేవి టోక్యోలో ఏడు రోజుల పాటు సైన్స్ ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ మియజాకీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సకూరా ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. భారతదేశం నుంచి కేవలం 12 మంది ఎంపిక కాగా వారిలో ఇద్దరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. అధ్యాపకుల్ని రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు అభినందించారు.

సజావుగా ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశ పరీక్ష శనివారం సజావుగా జరిగినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్య కేంద్ర పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తోపాటు ఆదిత్య డిగ్రీ కాలేజి (కాకినాడ), ఎంఎస్ఆర్ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజి (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజి (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజి (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజి (కర్నూలు), శ్రీసాయి డిగ్రీ కాలేజి (అనంతపూర్) ల్లో పరీక్ష జరిగిందన్నారు. ఆదివారం సాయంత్రం ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు.

గూడ్స్ రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెనాలి-ఒంగోలు ప్రధాన రైలు మార్గంలో నిడుబ్రోలు-మోదుకూరు స్టేషన్ల మధ్య గుర్తుతెలియని యువకుడు గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్‌పీ ఎస్సై జి.వెంకటాద్రి శనివారం తెలిపారు. గుర్తుతెలియని 30 సంవత్సరాల యువకుడు ఒక్కసారిగా గూడ్స్‌కు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం గుర్తించిన లోకో పైలెట్ వెంటనే తెనాలి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా బిస్కెట్ కలర్ ప్యాంట్, గళ్ల చొక్కా ధరించిన యువకుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహం వద్ద పగిలిపోయి ఉన్న సెల్‌ఫోన్ ఉంది. ఇతర వ్యక్తిగత సమాచారం లభించక పోవడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సర్కిల్స్ విభజన.. మారిన స్వరూపాలు

- గతంలో ఉమ్మడి జిల్లా అంతా సర్కిల్‌గా ప్రాధాన్యం
- ప్రస్తుతం రెండు, మూడు డివిజన్‌లకే పరిమితం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీ డీసీఎల్) పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్కిల్స్ విభజన ప్రక్రియతో స్వరూపాలు ఒక్కసారిగా మారిపోయాయి. గతంలో విద్యుత్ గుంటూరు సర్కిల్ స్థాయి చెప్పుకోవాలంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదు డివిజన్‌లతో విస్తరించి ఉండేది. ఇప్పుడు కేవలం రెండు డివిజన్‌లకే పరిమితమైపోవటంతో సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ప్రాధాన్యం కూడా తగ్గింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ ప్రస్తుతం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు సర్కిల్ స్థాయి గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లు కలుపుకొని కొత్త సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. అలానే రాజధాని అమరావతి కేంద్రంగా కొనసాగుతున్న సీఆర్‌డీఏ సర్కిల్ గతంలో మాదిరిగానే గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లతో అదే పరిధిలో ఉంది. ఇక కొత్తగా ఏర్పాటైన పల్నాడు సర్కిల్ రెండు డివిజన్‌లు కాగా బాపట్ల సర్కిల్ కూడా రెండు డివిజన్‌లకే పరిమితమయ్యాయి. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్ పరిధిలో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు కలిపారు. కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల సర్కిల్ పరిధిలో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు కలిసి సర్కిల్‌గా ప్రకటించారు. ఫలితంగా సర్కిల్స్ ప్రాధాన్యం తగ్గిపోయింది.

తగ్గిన గుంటూరు సర్కిల్ ప్రాధాన్యం

సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఉండేది. సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల డివిజన్‌లతో మొత్తం ఐదు డివిజన్‌లతో ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది. సర్కిల్ ఎస్ఈ స్థాయి కూడా ఐదు డివిజన్‌లను పర్యవేక్షించటం, జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులతో కీలకంగా వ్యవహరించేవారు. అటువంటిది ప్రస్తుత విభజనతో ఉమ్మడి జిల్లా గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌గా రూపాంతరం చెందటంతో ఆపరేషన్ ఎస్ఈల ప్రాధాన్యత తగ్గినట్లయింది. అయితే విభజన ప్రక్రియ పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఆ స్థాయిలో సిబ్బంది నియామకాలు లేవని సిబ్బంది అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

బెల్టు షాపు పెట్టినా.. ఎమ్మార్పీ ఉల్లంఘించినా..

- కఠిన చర్యలు తప్పవు
- నాటు సారా తయారీ పై ఉక్కుపాదం
- ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, పక్కన ఏసీ రవి కుమార్ రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు వారి షాపుల పరిధిలో బెల్టుషాపు పెట్టినా, షాపుల్లో మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా తయారీపై ఉక్కు పాదం మోపుతున్నామని, ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్ పెడతామని ఆయన తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. బెల్టు షాప్ నిర్వహిస్తూ పట్టుపడితే మొదటిసారి లక్ష రూపాయలు జరిమానా, బైండోవర్ కేసులు పెడతామన్నారు. రెండో పర్యాయం పట్టుపడితే రూ.5 లక్షల జరిమానా, షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే మొదటిసారి రూ. 5 లక్షల జరిమానా, రెండోసారి షాపు లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ఎస్‌టీఎఫ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారని, డెకమ్ ఆపరేషన్ ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, బొల్లాపల్లి, మాచర్ల బోర్డర్ ప్రాంతాల్లో నాటు సారా తయారవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దాడులు చేపడతామన్నారు. పల్నాడు జిల్లాను నాటు సారా జిల్లాగా ప్రకటించేలా చేస్తామన్నారు. టీంలు ఏర్పాటు చేసి దాడులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో పాటు ఇతర అధికారులు కూడా భాగస్వాములు చేసి అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎన్‌డీపీ లిక్కర్ ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి వస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దులైన తెలంగాణ, కర్ణాటక, గోవా, చెన్నై నుంచి ఎన్‌డీపీ లిక్కర్ వస్తుందని, దీనిని నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్‌డీపీ లిక్కర్ అమ్మిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవి కుమార్ రెడ్డి, ఈఎస్‌లు అరుణ కుమారి (గుంటూరు), మణికంఠ (నరసరావుపేట), ఏఈఎస్‌లు మారయ్య బాబు, రవీంద్ర, పల్నాడు, గుంటూరు జిల్లాల సిఐలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్, ఏడు నియోజకవర్గాల పరిశీలకులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏడు నియోజకవర్గాల పరిశీలకులు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులతో సమన్వయం చేసుకొని సభ్యత్వం వేగవంతం చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉందంటే ఒక ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. ఇప్పటికి 70 లక్షల సభ్యత్వంతో టీడీపీ దేశంలో బలంగా క్యాడర్, కార్యకర్తలు కలిగిన పార్టీగా ఎదిగిందన్నారు. యువనేత నారా లోకేశ్ సరికొత్తగా ఆలోచించి బీమా పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. చనిపోయిన ప్రతి ఒక్కరికి గతంలో రూ.2 లక్షలు చెల్లించేవారని, అయితే దానిని రూ.5 లక్షలకు పెంచడం ఒక భరోసాగా చెప్పవచ్చు అన్నారు. అంతేగాక మట్టి ఖర్చులకు రూ. 10 వేలు తక్షణ సహాయం కూడా అందిస్తున్నారని అన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. అందుకనే ప్రజలు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా ప్రతి క్రియాశీలక సభ్యుడికి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర నాయకులు ఎం.ధారునాయక్, నల్లపాటి రామచంద్ర ప్రసాదు, తాత జయప్రకాష్ నారాయణ, దాసరి ఉషారాణి, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, నాగోతు శౌరయ్య, కడియాల వెంకటేశ్వరరావు, వల్లెపు నాగేశ్వరరావు, గొట్టిపాటి జనార్దన్‌బాబు, కొట్టా కిరణ్, దాసరి ఉదయ్‌శ్రీ, కనుమూరి లక్ష్మి, కోసూర రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేడు అటవీ అమరవీరుల సంస్మరణ దినం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని అరణ్య భవన్‌లో నిర్వహించాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి ఆ డిపార్టుమెంట్ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లుగా పేర్కొన్నారు.

ఇటుకల కింద పడి వ్యక్తి మృతి

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటుకల లారీ పంక్చర్ కావడంతో బోల్తా కొట్టిన ఘటనలో ఇటుకలు మీద పడి దానిపై ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు శనివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. మృతుడిది తాడేపల్లిగూడెంగా పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం నుంచి గుంటూరుకు ఇటుకలు సరఫరా చేస్తున్న లారీ మార్గమధ్యంలోని నాగార్జున విశ్వవిద్యాలయ ఎదుట పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. లారీ పైనున్న తాడేపల్లికు చెందిన సత్యనారాయణ(53) అనే వ్యక్తి కింద పడగా, అతనిపై ఇటుకలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

నైట్‌షెల్టర్లు.. నామమాత్రమే

(5 పేజీ తరువాయి)

స్నానం తదితరాలు లేక, దుస్తులు శుభ్రం చేసుకునే పరిస్థితి లేక మురికిగా కాలం వెళ్లదీస్తుంటారు.

- గుంటూరులోని అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టాభిపురంలో మూడు ప్రాంతాల్లో నైట్‌షెల్టర్లు ఉన్నాయి. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ అపరిశుభ్రతతో అధ్వానంగా ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌ను ఒక్కో స్వచ్ఛంద సంస్థకు అప్పగించినా వాటిని నిర్వహించలేక బాధ్యతల నుంచి ఆయా సంస్థలు వైదొలిగాయి. గత ఐదేళ్లు ఈ కేంద్రాల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో ఆశ్రయం కోసం వచ్చే నిరాశ్రయులకు కనీస సౌకర్యాలు ఇక్కడ ఉండటంలేదు. ఉండటానికి పెద్ద పెద్ద గదులున్నా సరైన బెడ్స్, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు నిరాశ్రయులు, అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. అరండల్‌పేట ఒకటో లైన్‌లోని నైట్‌షెల్టర్ పరిసరాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంది. కొన్ని రోజులుగా ఈ సెంటర్ తాళాలు కూడా తీయడంలేదని సమాచారం. బస్టాండ్ వద్ద ఉన్న కేంద్రానికి విద్యుత్ సరఫరా లేక అరకొర వచ్చే వారు కూడా దోమల బాధ తట్టుకోలేక వెళ్తున్నారు. పట్టాభిపురంలోని సెంటర్లో అయితే ఇద్దరు ముగ్గురు కూడా లేరు. దీంతో జీజీహెచ్ వద్ద అయితే రాత్రిళ్లే కాక పగలు కూడా వందల సంఖ్యలో ఉంటుంటారు. ఎవరైనా ఆహారం తెచ్చి పెడితే తిని అక్కడే ఎండకు, వానకు, చలికి అల్లాడుతుంటారు.
- తెనాలిలో బాలాజీరావుపేటలో గతంలో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్ వైసీపీ హయాంలో మూతపడింది. నందులపేటలోని నైట్‌షెల్టర్‌లో సుమారు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేంద్రాల గురించి తెలియక పెద్దసంఖ్యలో అభాగ్యులు రోడ్లపై ఆశ్రయం పొందుతున్నారు.
- పొన్నూరులో దశాబ్దాలుగా నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బిచ్చగాళ్లు, ఏ ఆశ్రయం లేని వారు పట్టణ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై జీవనం సాగిస్తున్నారు. ఓవర్‌బ్రిడ్జి, రైల్వేప్లాట్‌ఫాంలపై 35 మంది వరకు రాత్రి వేళ సేదతీరుతున్నారు.
- నరసరావుపేటలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణకు నిధుల కొరత నెలకొంది. గుంటూరురోడ్డులోని వసతిగృహాన్ని మూసేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మరో వసతి గృహంలో 25 మంది మహిళలు ఉంటున్నారు. అయితే ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని నిర్వాహకులు తెలిపారు.
- పిడుగురాళ్లలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ కొన్నేళ్లుగా ఉంది. ఇక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. అయితే అక్కడ ఉండేవారికన్నా రోడ్ల మార్జిన్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే అభాగ్యులే అధికం.
- వినుకొండలో ఐదేళ్లుగా నిరాశ్రయులకు వసతిగృహం కొనసాగుతుంది. దాతల సాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే ఇక్కడ అందరికీ కాకుండా కొందరికే ఆశ్రయం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 30 మందికి అవకాశం ఉన్నా కేవలం 14 మందికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ కోరగా ఆశ్రమానికి మున్సిపాలిటీకి ఎటువంటి సంబంధంలేదన్నారు.
- చిలకలూరిపేటలో ప్రస్తుతం ఎటువంటి నైట్‌షెల్టర్లు లేవు. కొన్నేళ్ల క్రితం ఏఎంజీ సంస్థ కుమ్మరికాలనీలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. అయితే దీనిని ఉపయోగించుకునే వారు లేకపోవడంతో మూసివేశారు.
- మాచర్లలోని రామాటాకీస్‌లైన్‌లో స్వశక్తి రూరల్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ ఉంది. అయితే దీని గురించి నిరాశ్రయులకు సమాచారం లేదు. ఇక్కడ ఐదుగురికే ఆశ్రయం పొందే అవకాశం ఉంది.
- బాపట్లలోని రైలుపేటలో మెప్మా పర్యవేక్షణలో ఐదేళ్లుగా ఉన్న నైట్‌షెల్టర్‌లో 15 మంది ఉండటానికి అవకాశం ఉంది. అయితే 15 మందికి ఒకే మరుగుదొడ్డితో ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ మరో మూడు మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు కూడా అందజేశారు. నిర్వాహకులకు ఏడాది నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు.
- రేపల్లెలోని ఐదో వార్డులోని నైట్‌షెల్టర్‌లో నామమాత్రపు వసతులు ఉండటంతో బసకు ఎక్కువ మంది రావడంలేదు. గతంలో 40 మందిపైనే ఉండేవారు, ఇప్పుడు 16 మంది మాత్రమే ఉంటున్నారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

కుమారుడు కొట్టి గెంటేశాడు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనను కుమారుడే కొట్టి ఇంటి నుంచి గెంటేశాడని రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన బండ్లమూడి సామ్రాజ్యం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఆమె మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లపాడులో ఐదుగురు పార్టనర్స్‌తో కలిసి కోటి రూపాయలతో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ 2016 పెట్టారు. అందులో ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యం, ఆమె తమ్ముడు లింగం శేషు కుమార్ కూడా పార్టనర్స్‌గా ఉన్నారు. అందులో ఒక పార్టనర్ బోడపాటి శ్రీనివాసరావు తీరు నచ్చక ఆమె తమ్ముడు ఫ్యాక్టరీ నుంచి తప్పుకున్నాడు. ఆయన పెట్టుబడి రూ.30 లక్షల్లో రూ.15 లక్షలు తీసుకొని మిగిలిన రూ. 15 లక్షలు సామ్రాజ్యంకు ఇవ్వమన్నాడు. ఆ రూ.15 లక్షల కోసం ఆమె కంపెనీ చుట్టూ తిరుగుతుంటే, మాకు సంబంధం లేదు, నీ కుమారుడు అయిన సుబ్రహ్మణ్యంను అడగమని సుబ్బారావు, నాగేశ్వరరావు, వెంగయ్య ఆమెను కొట్టి బయటకు గెంటేశారు. ఆ డబ్బులు విషయాన్ని ఆమె తన కుమారుడిని అడుగగా, అతనితో ఉంటున్న ఓ మహిళతో సామ్రాజ్యంను కొట్టించి 80 గ్రాముల బంగారం, 31 సెంట్లు భూమి కాగితాలు లాగేసుకుని ఇంట్లో నుంచి గెంటేశారు. బంగారం, భూమి కాగితాలు వారి వద్దనే ఉన్నాయని సామ్రాజ్యం ఆరోపిస్తుంది. ఈ విషయంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, నల్లపాడు పోలీసు స్టేషన్‌కు పంపారు. ఎఫ్ఐఆర్ కట్టారుగానీ, ఇంకా కోర్టుకు పంపలేదని చెబుతూ తనకు న్యాయం చేయమని కోరారు.

రేసు వాహనం ఢీకొని మహిళకు గాయాలు

గుంటూరు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ రేసుల కారణంగా శనివారం రాత్రి రింగ్ రోడ్డులో ఓ ప్రమాదం జరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు వైపు నుంచి నగరంలోని లక్ష్మీపురం వైపు వెళ్లేందుకు ఓ ద్విచక్ర వాహనంపై ఖలీఫా అనే యువకుడు మితి మీరిన వేగంతో దూసుకొచ్చాడు. ముందుగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, వెనుక కూర్చున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు ఘటనా స్థలం చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు షేక్ ఖలీఫా అని విజయవాడలో డెంటల్ విద్య అభ్యసిస్తున్నట్లు తెలిపాడు. ఈ ప్రమాదంపై వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఖలీఫాను అరెస్టు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు కార్తీక వనసమారాధనలు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాలివాహన సమన్వయ సంఘం ఆధ్వర్యంలో 28వ కార్తీక వనసమారాధన కార్యక్రమం ఈ నెల 10 ఉదయం పేరేచర్ల సమీపంలోని మామిడితోటలో జరుగుతుందని ఆనిసియేషన్ నాయకులు రాజవరపు శ్రీనివాసరావు, ఆర్వీ నారాయణ, రాజవరపు మురహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. శాలివాహనులంతా ఉదయం 9 గంటలకే కార్యక్రమానికి హాజరై వన సమారాధనలో పాల్గొనాలని కోరారు.

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో..

బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఈ నెల 10వ తేదీన అమరావతి రోడులోని హిందూ ఫార్మసీ కళాశాల ఆవరణలో జరుగుతుందని బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఆర్ లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే మహాన్యాస పూర్వక ఏకాదవ రుద్రాభిషేకం, కార్తీక దామోదర పూజ తదితర కార్యక్రమాలతో వన సమారాధన ప్రారంభమవు తుందన్నారు. బ్రాహ్మణ బంధువులందరూ తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



'మనఃసాక్షి' నాటికలో ఓ సన్నివేశం

నాటకోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడులోని ఎల్వీఆర్ క్లబ్ వేదికగా గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే. నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో రెండు రోజుల పాటు జరిగే నాటకోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను క్లబ్ వణుకూరి శ్రీనివాసరెడ్డి. సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయుడు గోపి, కావూరి సత్యనారాయణ, అల్లూరి రామలింగయ్య పరిషత్ అధ్యక్షుడు శివప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా తొలిరోజున 'మనః సాక్షి', 'హెచ్చరిక' సాంఘిక నాటికలను ప్రదర్శించారు. అనం తరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని కళా పరిషత్ సభ్యులు కాట్రగడ్డ రామకృష్ణ , బొప్పన నరసింహారావు పర్యవేక్షించారు.

ప్రత్యేక హోదా సాధన కోసం రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోరుతూ కమ్యూనిస్టు ఇండియా, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ, సమాజ్ వాది పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల నిమిత్తం సభను జయప్రదం చేయాలని ప్రజానీకానికి ఆయన పిలుపునిచ్చారు. ధర్నాలో పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యంపై హర్షం

● టీడీపీ నాయకులు సతీష్‌శర్మ

గుంటూరు నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిటీడీపీ నాయకుడు కోనూరు సతీష్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



వైభవంగా శ్రీ పుష్ప యాగం

గుంటూరు(తూర్పు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ పుష్ప యాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం, శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన కార్యక్రమాలను వేద పండితులునిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం రమణీయంగా జరిపారు. అనంతరం 21 రకాల పుష్పాలతో పుష్పయాగ మహోత్సవం చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

నేడు జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ, మెలోడీ వాయిస్ క్లినిక్‌లో 18వ జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫోనో సర్జన్, సదస్సు నిర్వాహకులు డాక్టర్ వీ ఫణీంద్ర కుమార్ తెలిపారు. స్థానిక క్లినిక్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాం తాల నుంచి 70 మంది ఈఎన్‌టీ సర్జన్లతో పాటు ఈఎన్‌టీ పీజీ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. స్వర పేటికలో ఏర్పడే కణితలు బొంగురు గొంతుకు కారణమౌతాయని,వీటిని లేజర్‌తో తొల గిస్తామని తెలిపారు. రోగి మాట్లాడుతుండానే ఈ చికిత్స జరుగుతుందని, చికిత్స సమయం లోనే రోగి స్వరంలో మార్పును స్పష్టంగా తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ చికిత్సలను ఇతర ఈఎన్‌టీ వైద్యులకు నేర్పేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సదస్సులో లైవ్ సర్జరీ డెమాన్‌స్ట్రేషన్‌లతో పాటు మేక స్వర పేటికపై పీజీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని అన్నారు. సమావేశంలో డాక్టర్ కల్యాణ్ పాల్గొన్నారు.

పేదల పొట్ట కొట్టి.. పెద్దలకు కట్టబెట్టి..

● ఈద్గా స్థలంలో భారీ కార్ల షెడ్డు నిర్మాణం
● బడా సంస్థకు లీజు వెనుక ఓ టీడీపీ నేత
● చేతులు కట్టేసుకొన్న వక్ఫ్ ఇన్‌స్పెక్టర్
● అనుమతిలేని నిర్మాణాన్ని పట్టించుకోని కార్పొరేషన్
● వక్ఫ్ బోర్డు సీఈవోకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



అంజుమన్ సంస్థకు చెందిన ఈద్గా స్థలంలో నిర్మించిన భారీ షెడ్డు, స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున వాణిజ్య ప్రదేశంలో ఉన్న రూ. కోట్ల విలువ చేసే అంజుమన్ సం స్థకు చెందిన ఈద్గా స్థలం బడా సంస్థకు లీజుపరమైంది. గుట్టు చప్పుడు కాకుండా లీజు పొందిన కార్ల సంస్థ ఎంచక్కా స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడమే కాకుండా భారీ షెడ్డు నిర్మాణాన్ని కూడా చేపట్టింది. ఇంత జరుగుతున్నా అటు వక్ఫ్‌బోర్డు, ఇటు నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు కారణం ఈ లీజు అధికార టీడీపీకి చెందిన ఒక నేత కనుసన్నల్లో జరగడమే. గతంలో ఈద్గా స్థలం అన్యాక్రాంతమై పోతోందని ఎవరైతే గగ్గోలు పెట్టారో వాళ్లే ఇప్పుడు దానిని బడా సంస్థకు కట్టబెట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఇంత పకడ్బందీగా షెడ్డు, ఫెన్సింగ్ వేయడం వలన రేపటి రోజున రంజాన్, బక్రీద్ పండగల సమయంలో ముస్లింలు ప్రార్థన చేసుకొనే అవకాశం కూడా లేకుండా పోతుంది.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని నగరంపాలెంలో అంజుమన్-ఏ-ఇస్లామియా సంస్థకు ఎంతో ఖరీదైన స్థలం ఉంది. మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లాకు సమీపంలోని ఈ స్థలాన్ని గజిట్‌లో ఈద్గాగా నోటిపై చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రంజాన్, బక్రీద్ పండగల రోజుల్లో ముస్లింలు ఇక్కడ ప్రార్థనలు నిర్వహిస్తుం టారు. మిగతా రోజుల్లో ఈద్గా స్థలం ఖాళీగా ఉంటుంది. అయితే, కొన్ని సంవత్సరాల క్రితమే ఈద్గా స్థలం నిర్వహణ కోసం అంజుమన్ సంస్థ కొంతమంది పేదలకు చిరు వ్యాపారం చేసుకునేందుకు లీజుకు ఇచ్చింది. ఎర్రమట్టి, ఇటుకరాళ్లు, ఇసుక, పూలమొక్కలు, కుండీలు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. చిరు వ్యాపారాలు కావడం వలన రంజాన్, బక్రీద్ సమయంలో ఎంతో సులభంగా ఆ స్థలాన్ని ఖాళీ చేసి ప్రార్థనలు జరుపుకునేందుకు అనువుగా మార్చేసే వారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబ సభ్యుడు అంజుమన్‌కు, కేర్ టేకర్ కమిటీకి అధ్యక్షుడిగా ఉండేవారు. అక్కడి స్థలంలో ఆయన మరికొన్ని దుకాణాలకు లీజుకు ఇచ్చారు. టీ స్టాల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటరు వంటివాటికి కేటాయించారు. దీనిపై అప్పట్లో ముస్లిం మైనార్టీ నాయకులతో పాటు టీడీపీ నాయ కులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డుకు ఫిర్యాదులు చేశారు. పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో పాత వాటిని అలానే ఉంచి వైసీపీ హయాంలో ఏర్పాటైన వాటిని తొలగించారు. ఇప్పుడు వాళ్లెవరూ నోరు మెదపడం లేదు. కాగా, గత బక్రీద్ పండగ తర్వాత కార్ల సంస్థకు ఇక్కడ అనుమతి ఇచ్చారు. తొలుత చిన్నపాటి టెంటు కింద ఏర్పాటు చేసి నేడు భారీ షెడ్డు, ఫెన్సింగ్‌ని నిర్మించేశారు. అంజుమన్ సంస్థ స్థలమైనప్పటికీ అందులో ఏదైనా నిర్మాణం చేయా లంటే నగరపాలకసంస్థ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అలాంటిది ఎలాంటి అనుమతి లేకుండానే షెడ్డు ఏర్పాటై పోయింది. కొంతమంది మైనార్టీ నాయకులు వక్ఫ్‌బోర్డు సీఈవోకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకుండా పోయిందని ఆ నాయకులు తెలిపారు.

కష్టానికి తగిన గౌరవం టీడీపీలోనే: డేగల ప్రభాకర్



మాట్లాడుతున్న డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి అంకితభావంతో పని చేసే వారికి తగిన ప్రాధాన్యత, సముచిత స్థానం తెలుగుదేశంలోనే దక్కుతుందని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరులోని నగర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో పనిచేస్తే ఎవరికైనా సరే తనకు లాగే ఊహించని పరిణామంతో పదవులు రావచ్చని చెప్పారు. సర్పంచ్ స్థాయి నుంచి ఈ స్థాయికి చేరుకుంటానని అసలు ఊహించలేదని, టీవీలో తన పేరు వస్తుండడం చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. చంద్రబాబుని నమ్ముకుని పార్టీకోసం పనిచేస్తే ప్రతి ఒక్క నాయకుడికి న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కష్ట కాలంలో అం డగా ఉండి ప్రజల్లో మమేకమై పనిచేస్తారో వారిని పార్టీ ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుం దన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు పార్టీకి రుణపడి ఉంటానని అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో మమేకమవుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిఒక్కరికి కలుపుకొని అందరితో కలిసి పనిచేస్తానని చెప్పారు. పార్టీ తనపైన పెట్టుకున్న నమ్మకానికి, పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి దక్కడం కోసం ప్రత్యేకంగా పరోక్షంగా కృషి చేసిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు, సహకరించిన కేంద్రమంత్రి డాక్టర్ .పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో యర్రగోపు నాగేశ్వరంావు, కొండెపు శేఖర్ యాదవ్, బీరం వెంకటేశ్వర రావు, బీరం శ్రీను, బొక్కిసమ్ శివరాం, షేక్ హనీఫ్, మేకల బాబురావు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు: మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలతో మమేకమై, పార్టీలో క్రియా శీలంగా పనిచేస్తూ, వైసీపీ ఐదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి పోరాడినవారికి, ప్రజలకు అండగా నిలచినవారికి నామినేటెడ్ పోస్టుల భర్తీలో తగిన ప్రాధాన్యత కల్పించడం సంతోషంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనను ప్రోత్సహించిన హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సహాయాన్ని ఎన్నటికీ మరిచిపోలేనిదన్నారు. తెలుగుదేశంపార్టీలో ప్రస్థానాన్ని ప్రారంభించిన తనకు ఇది అధిష్ఠానం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నానని, ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి అంకిత భావంతో పనిచేస్తానని మోహనకృష్ణ చెప్పారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి నారా లోకేష్ సాగించిన యువగళం పాదయాత్రతో లోకేష్ ప్రజల్లో భరోసా, పార్టీలో నూతనోత్తేజం నింపారని, నాడు వైసీపీ దాడులను తట్టుకుని నిలిచిన ప్రతి ఒక్కరికి నేడు లోకేష్ అండగా నిలుస్తున్నారని మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. అధినేత చంద్రబాబుపై అభిమానంతో సుదీర్ఘ కాలంగా అమెరికాలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ తెలుగుదేశం పార్టీకి సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నాని చెప్పారు.

జీఎంసీ ఆదాయానికి గండికొడితే చర్యలు తప్పవు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించిన ఆదాయానికి గండికొడితే ఎవరిపైనా అయినా సరే చర్యలు తప్పవని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్లు, సైకిల్‌స్టాండ్లు, మరుగు దొడ్లు, సండ్రీస్ మార్కెట్లలో ఆశీలను నగరపాలక సిబ్బందికి మాత్రమే చెల్లించి రశీదు పొందాలని, దళారులు వసూళ్లకు వస్తే నేరుగా నగర పాలక సంస్థ కాల్ సెంటర్ కి కాల్ (0863-2345103) చేసి ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన వివిధ మార్కెట్లు, సైకిల్ స్టాండ్ లు, మరుగుదొడ్ల వద్ద నుండి ఆశీలు వసూళ్లకు గతంలో పాటదార్ల గడువు ముగిసి నందున, నూతనంగా టెండర్ కం ఓపెన్ ఆక్షన్ ఆమోదం కోసం జీఎంసీ స్థాయీ సంఘానికి పంపినట్లు తెలిపారు. ఆమోదం వచ్చే వరకు జీఎంసీ సిబ్బందే డిపార్టుమెంట్ వసూళ్లు చేస్తున్నారని, నగరపాలక సంస్థ ఐడి కార్డ్ తో, జీఎంసీ అధీకృత రశీదు అందించే వారికే ఆశీలు ఇవ్వాలని తెలిపారు. ఆశీలు వసూళ్ళపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీ వసూళ్ల వివరాలను అందించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆశీలు వసూళ్లపై క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

'చిలకలపూడి'కి పదవిపై సర్పంచ్‌ల హర్షం



బాణసంచా కాలుస్తున్న సర్పంచ్‌లు

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావును నియమించడంపై సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత పంచాయితీ పరిషత్(న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తీ వీరాంజనేయులు మాట్లాడుతూ నామినేటడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. సర్పంచ్‌ల హక్కుల కోసం అనేక పోరా టాలు చేసిన చిలకలపూడికి పదవి రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు కే మోహనరావు, కే ఆశోక్‌కుమార్, సరోజిని నరసింహారావు, ముబ్బు శిరీష, ఆరుదల సాంబశివరావు, జగన్‌మోహనరెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులతో రేపు ప్రత్యేక సమావేశం

గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం సోమ వారం సాయంత్రం 5 గంటలకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మంది రంలో వీధి వ్యాపారుల సంఘాలతో ప్రత్యేక సమా వేశం జరగనుంది. ఈ మేరకు ఒక ప్రకటనలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆక్రమణల తొలగింపు, వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి వీధి వ్యాపార సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

● విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా



విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉప సంహరించు కోవాలని కాం గ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక నల్లచెరువులోని ఈఈ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో మాజీ ఎమ్మె ల్యేలు మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్ పలువురు నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మస్తాన్‌వలి మాట్లా డుతూ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నడ్డివిరిచే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేస్తోందని, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం దుర్మార్గమన్నారు. ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విజయ్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల ఉప సంహరించు కోకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గద్దం పాల్ విజయ్‌కుమార్, రాచకొండ జాన్‌బాబు, బిక్షా సునిల్, బొట్ల బ్రహ్మయ్య సుధీర్, ఇంతియాజ్, అంబటి రత్తయ్య, మోషే, రామకృష్ణ, పాలపటి అనిల్, షేక్ సుభాని, సుభాని, అడుసు మల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



సంగీత కచేరి చేస్తున్న డాక్టర్ వై రమాప్రభ

ఆకట్టుకున్న సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : గాయత్రి మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ముత్తుస్వామి దీక్షితుల ఆరాధనా సంగీత మహోత్సవం శనివారం జరిగింది. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వేంక టేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథులుగా విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందం, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తుస్వామి దీక్షితార్ కృతులకు డాక్టర్ వై రమాప్రభ సోదాహరణాత్మక వివరణ ఇస్తూ శ్రావ్యంగా గానం చేశారు. వయోలిన్‌పై ప్రసన్న, మృదంగంపై బీరక సురేష్ బాబు, మోర్సింగ్‌పై టీ.లక్ష్మీశంకర్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంగీత మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి విజయ ఎంవై శేషురాణి పర్యవేక్షించారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ ర్యాలీ

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు విద్యార్థి యువత దూరంగా ఉండాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాతబస్టాండ్ టైటానిక్ షోరూమ్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, యువతతో కలిసి 'డ్రగ్స్ వద్దురా చదువే ముద్దు రా' అంటూ మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగించేలా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ఇన్‌చార్జ్ రాజీవ్ గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌లు ప్లకార్డులు, జెండాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం నేతలు మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత కూడా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరాపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీపతి ప్రకాశం, డాక్టర్ షామా సుల్తానా,పాల్ విజయకుమార్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుధీర్ బాబు, వేముల శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ తూర్పు అధ్యక్షులు హడు, ఏసు రాజు, తిరుమల్ రావు, మదన్, తన్వీర్, మోషే, సుమంత్, ఏసు బాబు, సలాం, రాజు, జానీ పలువురు నాయకులు ఉన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు

నిర్లక్ష్య బీఎల్‌వోలపై కఠిన చర్యలు

● ఎన్ఎస్‌కే కాజావలి, కృష్ణ - గుంటూరు ఈఆర్‌వో



గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసు కోవడం వరకే పట్టభద్రుల పని అని కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి (ఈఆర్‌వో) ఎన్ఎస్‌కే కాజావలి తెలిపారు, ఆ తర్వాత ఆ దరఖాస్తులో జత చేసిన సరిఫికెట్లపై అనుమానాలు ఉంటే దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి పరిశీలించాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులదేనని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని ఈఆర్‌వో తెలిపారు. పట్టభద్రుల ఓటరు నమోదులో జరుగుతున్న జాప్యంపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఎంతమంది పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు?

ఈఆర్‌వో: ఆన్‌లైన్ డేటా ప్రకారం 2.93 లక్షల మంది దరఖాస్తులు అందాయి. ఆఫ్‌లైన్‌లో మరో 37 వేల దరఖాస్తులు రాగా, రెండు కలిపి 3.30 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఎప్పటిలోపు ఇన్ని లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తారు?



ఈఆర్‌వో: ఈ నెల 20 లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉంది. బీఎల్‌వోలను నిరంతరం ఫాలోఅప్ చేయాల్సిందిగా ఏఈఆర్‌వోలైన ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీ డీవోలు, తహసీల్దార్లను ఆదేశించాం.

దరఖాస్తుల పరిశీలన విషయంలో బీఎల్‌వోలు బద్ధకిస్తున్నారు కదా?

ఈఆర్‌వో: వచ్చిన ప్రతీ ఒక్క దరఖాస్తుని బీఎల్‌వో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సిందే. ఈ విషయంలో మరో ప్రత్యామ్నాయానికి తావు లేదు. జాప్యం చేస్తే వాళ్లపై చర్యలు చేపడతాం. ఎలా పడితే అలా ఓటరు దరఖాస్తులు తిరస్కరించేందుకు లేదు. ఏ కారణంతో దరఖాస్తుని తిరస్కరించారో స్పష్టంగా రీ మార్కులు రాసి ఏఈఆర్‌వో ఆమోదంతో నా వద్దకు పంపాలి. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం.

ఇంకా చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌లోడింగ్ చేస్తున్నారు..

ఈఆర్‌వో: ఈ నెల 6తో ఏఈఆర్‌వో, ఈఆర్‌వో లాగిన్‌లు ఫ్రీజ్ అయిపోయాయి అయితే, ఓటరు నమోదు అనేది నోటిఫికేషన్ వెలువడేంత వరకు నిరంతర ప్రక్రియ. గడువు తేదీ దాటిన తర్వాత దరఖాస్తు చేసినవి మా వద్దకు రావు. ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురించిన తర్వాత వస్తాయి. అప్పుడు ఈసీ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

ఇన్‌చార్జిలను మార్చడం కాదు.. బుద్ధి మార్చుకోండి

● వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే మాధవి విమర్శలు

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌చార్జిలను మార్చడం కాకుండా, ముందు తన బుద్ధిని మార్చుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హితవు చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆమె విలేకరు లతో మాట్లాడారు. వైసీపీ ఇన్‌చార్జిల ప్రకటనపై ఘాటుగా స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వం అండ చూసుకొని, ఇష్టానుసారం దోచుకుతిన్న, ప్రజలపై, దౌర్జన్యాలకు పాల్పడ్డ, తమ గురించి పక్క నియోజకవర్గంలో తెలియవు అనే అవివేకంతో పోటీ చేసిన వైసీపీ నాయకులకు ప్రజలు ఇచ్చిన తీర్పుతో తత్వం బోధపడిందని అన్నారు. వైసీపీని వీడేందుకు సిద్ధమైన నేతలను కాపాడుకునేందుకు పూర్వపు నియోజకవర్గానికే వారిని ఇన్‌చార్జిలుగా పంపిస్తే ప్రజలు తిరిగి వారిని ఆదరిస్తారని అనుకోవడం అవివేకమని అన్నారు. జగన్ తన ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీకి రాని జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా జుగుప్సాకర పోస్టులు పెట్టినవారికి మద్దతుగా వైసీపీ నేతలు గుంటూరు ఎస్పీని కలవడంపై ప్రజలు వారిని అసహ్యించుకుంటున్నారని అన్నారు.

ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యసేవలు అందించాలి



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

జీజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వీరమణను ఎమ్మెల్యే మాధవి శనివారం మర్యాద పూర్వకంగా కలి శారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి నిరుపేదలు అధికంగా వస్తుంటారని, వారిపై వైద్య సిబ్బంది సానుకూల ధోరణితో నడుచుకోవాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేయాలని, ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



విద్యార్థిని సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, దేవపాల్ తదితరులు

సంఘటితంగా ఉంటేనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

● మేడ్ సేవలు స్ఫూర్తిదాయకం
● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులంతా సంఘ టితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు సూచించారు. మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ అసోసియేషన్ (మేడ్) రాష్ట్ర 7వ మహాసభ స్థానిక ఏసీ కాలేజీలోని జేడీ శీలం హాల్‌లో శనివారం జరిగింది. సభకు మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడ్ గత ఏడేళ్లుగా దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంచి కార్యాచరణ ప్రణా ళికతో ముందుకు సాగడమే కాకుండా, సామాజిక సేవా కార్య క్రమాలు చేయడంలో ముందు వరుసలో ఉండటం అభినందనీయ మన్నారు. దళిత ఉద్యోగుల ప్రగతికి పాటుపడాలన్నారు. దళిత ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు సహాయం మేడ్ కు ఉంటుం దని చెప్పారు. లిడ్ కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో దళిత ఉద్యోగుల సంక్షేమం కోసం అవిరళ కృషి చేసి వారి సమస్యల పరిష్కర దిశ్సూచిగా మేడ్ ఎదగాలని ఆకాం క్షించారు. దేవపాల్ మాట్లాడుతూ దళిత ఉద్యోగుల సమస్యల పరి ష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్న మేడ్ రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలో బలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 2024 నీట్‌లో ప్రతిభ కనపరిచిన ఆరుగురు విద్యార్థులను సన్మానించారు. కార్య క్రమంలో మేడ్ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి పొన్నూరు శామ్యూల్ జోబ్, జిల్లా అధ్యక్షులు లాగు జయరాజు, గద్దల రామదాసు, కందెల్లి వెంకట్, మంద సంగీతరావు, యేండ్లూరి చిట్టిబాబు, వినుకొండ రాజారావు, చిరువెళ్ల కృపావతి, రవీంద్రబాబు, పినపాటి ప్రమీల, బైరపోగు బెన్నెమ్మ ఉన్నారు.

తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స

● ఓహాయో వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య ఎం చంద్రశేఖర్



సదస్సులో పాల్గొన్న ఆచార్య చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సరైన ఔషధ వినియోగంతో హాస్పిటల్ వ్యయాన్ని తగ్గించి, రోగులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించవచ్చని యుఎస్ఏలోని ఓహాయో వర్సిటీ ఆఫ్ ఫిండ్లే ప్రొఫెసర్ ఎం చంద్రశేఖర్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అవినిడ ఇన్నోవేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. క్లినికల్ ఫార్మసీ అనేది వైద్యరంగంలో రోగులకు సమర్థవంతమైన ఔషధ చికిత్స అందించడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. ఫార్మసీ నిపుణులు వైద్యులతో కలిసి పనిచేస్తే రోగులకు సరైన మందులు ఇవ్వడం సాధ్యమన్నారు. క్లినికల్ ఫార్మసీ సేవలు వైద్యరంగంలో రోగులకు ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మరోఅతిథి డాక్టర్ కార్తీక్ రాకమ్, డాక్టర్ చింతమనేని మీన పాల్గొన్నారు.

కళాశాలను... కాపాడుకున్నారు!

1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థుల్లేక మూసివేసే పరిస్థితి. ఈ క్రమంలో గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎలాగైనా కళాశాలను నిలుపుకోవాలని గ్రామస్తుల తపన. ఈ దశలో వారు చేసిన చిరు ప్రయత్నం కళాశాలకు మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేర్చింది. ఆ ప్రయత్నమే దాతల సహకారంతో ఉచిత మధ్యాహ్న భోజన పథకం. అంతే నేడు కళాశాల పరిస్థితి మారిపోయింది. ఇదీ దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయగాధ.

- మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేరుకున్న వైనం
- దాతల సహకారంతో ఉచితంగా మధ్యాహ్న భోజనం
- ఇంటింటికీ వెళ్లి విజయాలు వివరిస్తున్న అధ్యాపకులు

(దాచేపల్లి, నవంబరు 9, ఆంధ్రజ్యోతి) రెండు దశాబ్దాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. 1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థు ల్లేక మూసివేసి గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిపే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో దాచేపల్లిలోని గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే పేద విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం, ప్రభుత్వానికి చెల్లించాల్సిన కాలేజీ ఫీజు కూడా తామే స్వయంగా చెల్లించి విద్యార్థులు కాలేజీలో చేరే విధంగా కృషి చేశారు. వారి కృషి ఫలించి కళాశాలను ఎత్తివేసే పరిస్థితుల నుంచి కేవలం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో కళాశాలను కొంతకాలం నడిపారు. పిల్లల్లో మరింత ప్రతిభను సాధించేందుకు గానూ ట్యూషన్లు పెట్టి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచారు. ఫలితంగా కేవలం రెండు అంకెలకే పరిమితమైన విద్యార్థుల సంఖ్య మూడు అంకెలకు చేరింది. ప్రస్తుతం కళాశాలలో 178 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో కళాశాల అభివృద్ధి కమిటీ విన్నపం మేరకు ఇంటర్ బోర్డు ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కూడా మంజూరు చేసింది. 2020-21లో 100 శాతం, 2021-22లో 100 శాతం, 2022-23 సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించింది. 2022-23లో కళాశాలకు చెందిన పానుబోతు మానస 965 మార్కులు సాధించి ఐఐటీలో సీటును దక్కించు కుంది. కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. ఆయా విద్యార్థుల కుటుంబాలు వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేందుకు మధ్యాహ్న భోజనం తోడ్పడింది.

స్థానికుల ప్రశంసలు

ప్రభుత్వం ఒకటి నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం అందిస్తుంది. దాచేపల్లిలో కొంతమంది దాతలు ఇచ్చిన నగదుతో కళాశాల అభివృద్ధి కమిటీ చేపట్టిన మధ్యాహ్న భోజనం నిర్విరామంగా రెండు దశాబ్దాలుగా కొనసాగించడం స్థానికులచే ప్రశంసలు అందుకుంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా ఇంటర్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందుబాటులో లేదు. ఇది కేవలం దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనతే. ఇదే విధానాన్ని దాతల సహకారంతో మరింత మెరుగ్గా కొనసాగించేందుకు అభివృద్ధి కమిటీ చర్యలు తీసుకుంటుంది.


దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యతోపాటు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అధ్యాపకులు ఉదయం 7 గంటల సమయంలో గ్రామాల్లో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరుతూ గత విద్యార్థులు సాధించిన ఫలితాలను, విజయాలను వివరిస్తున్నారు. విద్యతోపాటు ఉచిత భోజనం కూడా అందజేస్తున్నామని తెలియజేస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందిస్తుందని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థులను కళాశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డును వారికి అందించడంతో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు ఏర్పడుతున్నాయి.


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరబాబు, ఇతర అధ్యాపకులు

పేద విద్యార్థులకు అండగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం నిర్వహించడంతో విద్యార్థులకు కొంత ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనానికి ఇంటికి వెళ్లకుండా కాలేజీలో చేయడంతో తరగతు లకు గైర్హాజరు శాతం తగ్గింది. ఫలితంగా ఉత్తీర్ణత 100 శాతం సాధిస్తున్నాం.


- చంద్రశేఖరబాబు, కళాశాల ప్రిన్సిపాల్

ప్రభుత్వం సహకరించాలి

గత 21 సంవత్సరాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ కళాశాలలో ఉచిత భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం ముందుకొచ్చి మధ్యాహ్న భోజనానికి తమ వంతుగా సహకరించాలి. తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు అవకాశం ఉంది.


-తెలనాకుల సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ చైర్మన్

హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళ గిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న కూచ్ బెహర్ ట్రోఫీలో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు 200 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 615 పరు గులు సాధించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైన హిమాచల్‌ప్రదేశ్ జట్టు ఫాలో న్‌తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 103.5 ఓవర్లలో 283 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాత్విక్ కటోచ్ 9 ఫోర్లతో 68 పరుగులు చేసి రాణించాడు. ఆంధ్రా బౌలర్ ఎన్.రాజేష్ 30.5 ఓవర్లలో 73 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ 200 పరుగులతో ఘనవిజయం సాధించింది.


సాత్విక్ (68 పరుగులు)


రాజేష్ (4 వికెట్లు)

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసవత్తరంగా సాగాయి.


పోటీలలో తలపడుతున్న జట్లు

బాలురు, బాలిక విభాగాలకు సంబంధించి వివిధ జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ పోటీలు జరిగాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ పోటీలలో తలపడ్డాయి.

బాలుర విభాగంలో..

గుంటూరు, విశాఖపట్నం జిల్లాల జట్లు పోటీలో తలపడగా, గుంటూరు జిల్లా బాలురు 5-2 తేడాతో విజయం సాధించారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల మధ్య జరిగిన పోటీలో 7-2 తేడాతో శ్రీకాకుళం జిల్లా, విజయనగరం, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో 2-1 తేడాతో కర్నూలు జిల్లా, అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలలో 5-4 తేడాతో అనంతపురం జట్లు విజయం సాధించాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జిల్లాల మధ్య పోటీలో గుంటూరు జిల్లా 7-1 తేడాతో విజయం సాధించింది.

బాలికల విభాగంలో..

ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా 7-1 తేడాతో, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు 4-2 తేడాతో, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో విజయనగరం 2-1 తేడాతో, గుంటూరు, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జిల్లా 8-2 తేడాతో విజయం సాధించాయి. అలాగే విశాఖపట్నం, కృష్ణ జిల్లాల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జిల్లా జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు క్రీడారంగంలో మరింతగా రాణించాలని డీఈవో ఎస్. పురుషోత్తం అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పాఠశాల క్రీడా మైదానంలో బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. 68వ స్కూల్‌గేమ్స్ కబడ్డీ 14 సంవత్సరాలలోపు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. డీఈవో పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 3శాతం క్రీడా రిజర్వేషన్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రశాంత్‌బాబు, రౌండ్‌టేబుల్ వెంకటేష్, కేర్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, స్టేట్ అబ్జర్వర్ సుధాకర్, పాఠశాల హెచ్ఎం షేక్ మహబూబ్ సుభానీ, విద్యాకమిటీ ఛైర్మన్ డి.లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈక్రీడలలో 13 బాలుర జట్లు గుంటూరు, విశాఖ పట్టణంపై 57.37, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాపై 43.42, చిత్తూరు, అనంతపురం జిల్లాపై 52.46, కృష్ణా, నెల్లూరు జిల్లాపై 65.47, శ్రీకాకుళం, పశ్చిమగోదావరిజిల్లాపై 87.23తో విజయం సాధించారు. 13 బాలికల జట్లు గుంటూరు, విజయనగరంపై 39.7, అనంతపురం, కడపపై 48.13, పశ్చిమగోదావరి, నెల్లూరుపై 57.37, ప్రకాశం, కర్నూలుపై 74.29, తూర్పుగోదావరి, విశాఖపై 48.28, గుంటూరు, అనంతపురంపై 38.36 విజయం సాధించినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ హైస్కూల్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాల బాలికల ఫుట్ బాల్


తల పడుతున్న గుంటూరు, చిత్తూరు జట్లు

పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టు పై 1-0 తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు పై కడప జిల్లా జట్టు 6-0 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. గుంటూరు జిల్లా జట్టు పై అనంతపురం జిల్లా జట్టు 4-0 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

- పాత డొక్కు బస్సుల స్థానంలో వినియోగం
- గుంటూరు డిపోలకు 200 బస్సులకు ప్రతిపాదన
- మంగళగిరి, విజయవాడ, రాజధానికి రాకపోకలకు
- మంగళగిరి, గుంటూరులో హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్టీసీ యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అద్దె ప్రాతిపదికన మంగళగిరి, గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి 200 ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రతిపాదనలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీలో ఒక్క కొత్త బస్సు కొన్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ పూర్వ వైభవానికి



చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విభజిత జిల్లాకు 59 బస్సులు కేటాయించగా ఇందులో 42 సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అంతేగాక కాలుష్య రహిత చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. మంగళగిరికి 100, గుంటూరు-1,2 డిపోలకు మరో 100 బస్సులను కేటాయించనున్నారు. ఈ బస్సులు అందుబాటులోకి వచ్చాక మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధాని అమరావతి ప్రాంతంతో పాటు విజయవాడ రూట్‌కు ట్రిప్పులు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడతో పాటు నున్న వంటి ప్రాంతాలకు కూడా సర్వీసులను నడపాలని ప్రతిపాదనలు చేస్తున్నారు. గుంటూరు - విజయవాడ రాకపోకలకు కూడా ఇవే బస్సులను వినియోగించాలని భావిస్తున్నారు. ఈ బస్సుల చార్జింగ్ స్టేషన్ల కోసం డీపీటీవో రవికాంత్‌నేతృత్వంలో పలు ప్రాంతాల్లో అన్వేషణ ప్రారంభించారు. ఆ తర్వాత గుంటూరు, మంగళగిరి కేంద్రంగా హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మంగళగిరి డిపోతో పాటు గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న విజయవాడ నాన్‌స్టాప్ బస్టాండ్ వద్ద హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్‌ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చితే పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

బోరుగడ్డ తీరు మరోసారి

వివాదాస్పదం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనీల్ పోలీస్ కస్టడీ వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఇటీవల గన్నవరంలో ఓ హోటల్ ఘటన మరువక ముందే గుంటూరులోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బోరుగడ్డ విషయంలో పోలీసుల తీరు మళ్లీ వివాదాస్పదమైంది. ఏఈఎల్సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబుప్రకాష్‌ను కత్తితో బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నిందితుడిగా రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డ అనిల్‌ను ఇటీవల అరండల్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్న విచారించారు. ఈ క్రమంలో రాత్రికి స్టేషన్‌లోనే అనిల్ కుమార్ బసచేశారు. ఆ సమయంలో ఆయనకు పోలీస్‌స్టేషన్లోని టేబుల్‌పై బెడ్ షీట్లు పరుచుకుని, దిండు వేసుకుని నిద్రించే అవకాశం కల్పించడం, అదే సమయంలో ప్రైవేటు వ్యక్తి వచ్చి ఆయనతో ముచ్చటించే వెసులుబాటు కల్పించడం వంటి అంశాలు తీవ్ర దుమారం రేపాయి. ఇప్పటికే బోరుగడ్డ విషయంలో పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో తాజాగా వెలుగు చూసిన ఈ వ్యవహా రం అగ్గికి ఆజ్యం పోసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వికృత రూపంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను, వారి కుటుంబ సభ్యులను, మహిళలను, చిన్నపిల్లలను సైతం అసభ్యకరంగా దూషిస్తూ, బెదిరిస్తూ రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ విషయంలో పోలీసులు ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కోర్టు ఉత్తర్వులతోనే అవకాశం కల్పించాం : ఎస్పీ

విచారణలో ఉన్న ఖైదీ బోరుగడ్డకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని కొందరు చేస్తున్న


- పోలీస్‌స్టేషన్‌లోనే రిమాండ్ ఖైదీ బల్లపై నిద్ర
- ఆలస్యంగా వెలుగు చూసిన సీసీ కెమెరా ఫుటేజ్
- రాచమర్యాదలపై ఖండించిన ఎస్పీ సతీష్ కుమార్



ప్రచారం వాస్తవం కాదని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనిల్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు తనను కొట్టారని చెప్పడంతో కనీస సదుపాయాలు కల్పించాలని మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారన్నారు. వైద్య పరీక్షల్లో గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నట్లు వైద్యులు చెప్పడంతోనే బల్లపై పడుకునే అవకాశం ఇచ్చామన్నారు. అంతేగాని ఆయనకు ప్రత్యేకంగా రాచమర్యాదలు ఏమీ చేయలేదన్నారు. స్టేషన్ నుంచి సీసీ కెమెరా ఫుటేజ్ ఎలా బయటకు వచ్చిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బోరుగడ్డను ఎస్కార్ట్ పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకు వెళుతున్న సమయంలో గన్నవరంలో ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లిన సందర్భంలో జరిగిన పరిణామాలపై ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశామని తెలిపారు. శాఖాపరమైన దర్యాప్తు తర్వాత వారిపై మరిన్ని చర్యలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బోరుగడ్డపై అనేక పోలీస్ స్టేషన్లో కేసు ఉన్నప్పటికీ ముందుగా ఆయనను అరెస్ట్ చేసింది తామేననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ 2020లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నా అప్పట్లో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాను వచ్చిన తర్వాత ఆ కేసును బయటకు తీసి చర్యలు తీసుకున్నామని చెప్పారు. శాఖ పరంగా తాము ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐపై వేటు

బోరుగడ్డ వ్యవహారంలో మరో పోలీసు అధికారి బలయ్యారు. స్టేషన్‌లో రాత్రివేళ ఆయనకు రాచ మర్యాదలు చేశారంటూ అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా ఆరోపణల నేపథ్యంలో అరండల్‌పేట సీఐ కే శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ శనివారం రాత్రి రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.



- ఘోర ఓటమి తప్పదని కుంటిసాకులు
- గతంలో ఎన్నడూ గెలిచిన దాఖలాలు లేవు
- జనరల్ ఎన్నికల్లో వైసీపీ ఓటమికి విద్యావంతులే కారణం
- మళ్లీ అదే పరిస్థితులు ఎదురవుతాయని బరి నుంచి తప్పుకున్న వైనం
- కూటమి అభ్యర్థి ఆలపాటి, సిట్టింగ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మధ్యనే ఈ సారి పోటీ

మండలి ఎన్నికల్లో..

ముందే కాడి పడేసిన వైసీపీ

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలి ఎన్నికలకు సమామత్తమవుతూ ఓటర్ల చేర్పులకు శిబిరాల నిర్వహణ, మేధావులతో, పార్టీ శ్రేణులతో ఎక్కడికక్కడ సమావేశాలో టీడీపీ నేతలు, అభ్యర్థి ఉండగా.. అందుకు భిన్నమైన స్థితిలో వైసీపీ ఉంది. గతానుభవాల దృష్ట్యా ఘోర ఓటమి తప్పదని ముందే గ్రహించి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికకు ముందే వైసీపీ కాడి కింద పడేసింది. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి లేదంటూ తాము ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. దీంతో మరో నాలుగు నెలల్లో జరగనున్న ఎన్నికలో పోటీ టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ మద్దతుతో తిరిగి బరిలోకి దిగనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మధ్యనే జరగనుంది. ఈ ఎన్నికల్లో తప్పక వైసీపీ పోటీ చేస్తుందని ముందుగానే ఆ పార్టీ పెద్దలు విజయవాడకు చెందిన గౌతంరెడ్డి పేరుని ప్రకటించి ఓటరు నమోదు ప్రచార కార్యక్రమాలను కూడా నిర్వహించి ఇప్పుడు ముఖం చాటేయడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురౌతున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత గుంటూరు, కృష్ణా జిల్లాల్లో లక్షల మంది పట్టభద్రులు పాల్గొనబోయే ఎన్నిక వచ్చే మార్చిలో జరగనుంది. దాదాపుగా 3 లక్షల మందికి పైగా పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నియోజకవర్గం పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి తొలుత చిగురుపాటి వరప్రసాద్, ఆ తర్వాత వరుసగా బొడ్డు నాగేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు గెలుపొందారు. వైసీపీ ఏర్పడిన తర్వాత రెండు సార్లు ఈ నియోజకవర్గానికి ఎన్నిక జరిగింది. ఆ పార్టీ అండ తమకుందని చెప్పుకుని బరిలోకి దిగిన వారు ఎప్పుడూ గెలవలేదు. కాగా గత సార్వత్రిక ఎన్నికల్లో తమకు 40 శాతం ఓటు షేర్ వచ్చిందని, ఈ ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి తామే భారీ మెజార్టీతో గెలుస్తామని వైసీపీ నేతలు గత కొన్ని రోజుల నుంచి ఊదరగొడుతున్నారు. అలాంటప్పుడు ప్రజల్లో వారి బలమెంతో నిరూపించుకొనే చక్కటి అవకాశం కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రూపంలో వచ్చింది. ఎన్నికల బరిలో నిలిచి తమ బలమేంటో చూపెట్టాల్సింది పోయి ముందుగానే ఓటమి ఖాయమని తెలిసి పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించింది. అందుకు కుంటిసాకులు చెప్పకనే చెప్పింది. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం లేకుండా చేసింది. దీంతో ఉపాధి, ఉద్యోగాలు లేక పట్టభద్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వాళ్లంతా మళ్లీ తమని ఘోరంగా ఓడిస్తారని గ్రహించిన వైసీపీ నేతలు పరువు పోగొట్టుకోవడం ఖాయమని భావించే ఎన్నికల నుంచి తప్పుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పశ్చిమ డెల్టాకాల్వకు 6369 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 6369 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 286 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 975 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 532 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 176 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 394 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2660 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి



మోతడకలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన బీజేపీ నాయకులు

తాడికొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా క్రియాశీలక సభ్యత్వ ప్రముఖ్ కొత్తూరు వెంకటసుబ్బారావు అన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో శనివారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 50 వేలకు పైన సభ్యత్వం పూర్తయిందని తెలిపారు. ఈనెల 15వ తేదీతో సాధారణ సభ్యత్వం, క్రియాశీలక సభ్యత్వం పూర్తి అవుతుందన్నారు. అనంతరం బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు ఏర్పాటు చేసుకొని మండల కమిటీలు, జిల్లా అధ్యక్షుల ఎన్నిక కూడా జరుగుతుందని తెలియజేశారు. మండలంలో 2500 సభ్యత్వాలు పూర్తి అవుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టే పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు అన్నారు. జిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షేక్ బిలాల్ మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా భారతీయులందరిని కలిపి ఉంచే పార్టీ బీజేపీ అన్నారు. తాడికొండలో 400 మంది మైనారిటీలు బీజేపీలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ మండల బీజేపీ అధ్యక్షుడు మంచికలపూడి గంగాధర్‌రావు, ఎస్సీ మోర్చా నాయకులు ప్రకాష్, గుదూరు ప్రతాప్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కోట సాంబశివరావు, ఎస్టీ నాయకులు ఎం నాగేశ్వరరావు, ముప్పాళ్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల కాల్వలో పడిన వృద్ధురాలు

దుగ్గిరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాల చెక్‌పోస్ట్ సమీపంలో ఓ వృద్ధురాలు తుంగభద్ర కాల్వలో పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వృద్ధురాలు శనివారం మధ్యాహ్నం కొత్తలాకు వైపు నుంచి కాల్వ కట్ట మీదుగా వస్తూ చెక్‌పోస్ట్ వద్ద ఆగి కాల్వలోకి దూకింది. అక్కడే వున్న యువకులు గమనించి కాల్వలోకి దూకి వృద్ధురాలిని నీటి నుంచి వెలికి తీసి 108కి సమాచారం అందించారు. అపస్మారకస్థితిలో ఉన్న వృద్ధురాలికి ప్రథమ చికిత్స చేసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా వృద్ధురాలు మంచికలపూడి గ్రామానికి చెందిన యేమినేని రేణుకమ్మగా చెబుతున్నారు.

జోన్ డైరీ

- కాకుమాను మండలంలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9848133850లో సంప్రదించాలన్నారు.
- తాడికొండలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో నిర్మించిన టీచర్స్ క్వార్టర్స్ ఇతర భవనాల ప్రారంభ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ పీ జోగారావు తెలిపారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల సెక్రటరి వీఎన్ మస్తానయ్య పాల్గొంటారు.
- మంగళగిరి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో తాడేపల్లి మండల వైసీపీ ముఖ్య నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తాడేపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు అమరా నాగయ్య ఓ ప్రకటనలో తెలిపారు.
- తాడేపల్లి నులకపేట హనీఫ్ సీ ఫుడ్స్ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు బ్రైట్ హారిజన్స్ అకాడమి ఆధ్వర్యంలో 1001 ఇన్వెన్షన్స్ పుస్తకావిష్కరణ జరుగుతుందని అకాడమి ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నజీర్ అహ్మద్ చేతుల మీదుగా ఈ పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు.

నేడు జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ, మెలోడీ వాయిస్ క్లినిక్‌లో 18వ జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫోనో సర్జన్, సదస్సు నిర్వాహకులు డాక్టర్ వీ ఫణీంద్ర కుమార్ తెలిపారు. స్థానిక క్లినిక్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది ఈఎన్‌టీ సర్జన్లతో పాటు ఈఎన్‌టీ పీజీ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. స్వర పేటికలో ఏర్పడే కణితలు బొంగురు గొంతుకు కారణమౌతాయని, వీటిని లేజర్‌తో తొలగిస్తామని తెలిపారు. రోగి మాట్లాడుతుండానే ఈ చికిత్స జరుగుతుందని, చికిత్స సమయంలోనే రోగి స్వరంలో మార్పును స్పష్టంగా తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ చికిత్సలను ఇతర ఈఎన్‌టీ వైద్యులకు నేర్పేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సదస్సులో లైవ్ సర్జరీ డెమాన్‌స్ట్రేషన్ లతో పాటు మేక స్వర పేటికపై పీజీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని అన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- లక్షకు పడిపోతున్న ప్లేట్ లెట్స్
- రికార్డు కాని డెంగీ జ్వరాలు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ప్రత్తిపాడు ప్రాంతంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జలుబు, దగ్గుతో పాటు జ్వరాలు తీవ్ర రూపం దాల్చాయి. గతంలో చూడని విధంగా జ్వరంలోనే డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరానికి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. డెంగీ లేకపోయినా పడిపోయిన ప్లేట్‌లెట్స్‌తో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆర్ఎంపీలు, ప్రైవేటు వైద్యశాలలు జ్వరాల కేసులతో కిక్కిరిసి పోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్లనో.. దోమ కాటు వల్లనో జ్వరాలు తీవ్ర రూపం దాల్చాయి. సాధారణంగా వచ్చే జ్వరాలకు ప్లేట్‌లెట్స్ పడిపోయే పరిస్థితి ఉండదు. 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ఉండాల్సిన ప్లేట్‌లెట్స్ లక్షకు పడిపోతున్నాయి. కాని డెంగీ మాత్రం రికార్డు కావడం లేదని వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రతి రోజు ప్రత్తిపాడులోనే ఈ విధమైన కేసులు పది వరకు నమోదవుతున్నట్లు తెలుస్తుంది. ఒక్క సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే ఇటీవల ప్లేట్ లెట్స్ పడిపోయి ఐదు కేసులు నమోదయ్యాయి. జ్వరాలు అయితే సగటున రోజుకు 50 వరకు కేసులు వస్తున్నట్లు వైద్యులు తెలియజేస్తున్నారు.



ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కిక్కిరిసి ఉన్న రోగులు

ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి

- డాక్టర్ అఖిల్, సీహెచ్‌సీ ఇన్‌చార్జి



ఇటీవల కాలంలో ప్లేట్‌లెట్స్ పడిపోయిన కేసులు అధికంగా నమోదవుతున్నాయి. డెంగీ లక్షణాలు కనిపించకపోయినప్పటికీ ప్లేట్‌లెట్స్ మాత్రం లక్షకు పడిపోతున్నాయి. జ్వరాలతో పాటు ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రజలకు వైద్య సేవలందించడం గొప్ప వరం

- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప వరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై ఆసుపత్రిలో సుమారు రూ.పది కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎన్నారై వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు దేవుడు ఎంపిక చేసుకున్న సాధనమే వైద్యుడన్నారు. వైద్యుడు రోగి బాధను తన బాధగా భావించగలిగితే ఒక్క తప్పు కూడా జరగదన్నారు. భారతదేశంలో అత్యున్నత స్థాయికి చేరిన వారిలో ఎక్కువ మంది వైద్యులుగా జీవితాన్ని ప్రారంభించారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని వైద్య విద్యార్థులు వృత్తి పరంగా నిస్వార్థమైన సేవలందించాలని సూచించారు. వైద్య విద్యార్థులకు సమయపాలన ఎంతో ముఖ్యమని, అది పాటిస్తే జీవితంలో కచ్చితంగా విజయాలను సాధించగలరని అన్నారు. తాను తొలిసారి మెడికల్ కళాశాలలో అడుగు పెట్టినప్పుడు వైద్య వృత్తిని చాలెంజ్‌గా భావించానని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నారై ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
- ప్రత్తిపాడులో ప్రారంభమైన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుండి క్రీడల మక్కువ చూపాలని, దీని ద్వారా శరీరక ఉల్లాసంతో పాటు పోటీతత్వం కూడా పెంపొందుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల వద్ద రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ బేస్ బాల్ పోటీలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం బేస్ బాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో విజయాలు సాధిస్తూ మీ ఊరితో పాటు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. గెలుపు ఓటములు సహజమన్నారు. పోటీతత్వమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఒక్కొక్కటి చొప్పున 26 జట్లు ఈ పోటీలలో తలపడుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో అన్ని జిల్లాల నుంచి బెస్ట్ ప్లేయర్స్ 30 మందిని ఎంపిక చేసి వీరిలో నుంచి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే రాష్ట్ర టీంను ఎంపిక చేస్తారు.

కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, విద్యాకమిటీ చైర్మన్ చౌదరి, సర్పంచ్ ఆదినారాయణ, ఉపసర్పంచ్ మాధవరావు, స్టేట్ అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం.రవి, బీ.గంగాధరరావు, పేరం మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బేస్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

వైభవంగా శ్రీవేంకటేశ్వరుని కల్యాణోత్సవం

దుగ్గిరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. శివకేశవులిద్దరికీ అత్యంత ప్రీతిపాత్రమైనదిగా చెప్పుకునే కార్తీక మాసంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు సాకేత్, వేదాంతం రామచంద్ర నేతృత్వంలో అత్యంత వైభవంగా జరిగిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత ప్రధానాలయంలో స్వామివారికి కనువిందుగా అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మందిరంలో ఉత్సవ మూర్తులతో నిర్వహించిన కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేయగా ఆలయ ప్రాంగణమంతా గోవిందనామంతో మార్మోగింది. మంచికలపూడికి చెందిన కొండపనేని రవికిరణ్, అలేఖ్య దంపతులతో జరిపించిన కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం స్వామివారి ఊంజల సేవను నిర్వహించారు. కొంగర సుధీర్‌కుమార్, చుండూరు ఉమామహేశ్వరరావు, వంకదార ఫణికుమార్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.




దుగ్గిరాలలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కల్యాణోత్సవం, ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రజాపోరు ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

మంగళగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికై మంగళగిరిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరుగనున్న ప్రజాపోరు ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో శనివారం పీ.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రామారావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై ధర్నా జరుగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ధరలు, చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. జెమిలి ఎన్నికల ప్రతి పాదన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఎన్నికల ముందు మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల మందికి ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం నేతలు ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, వీసం జవహర్‌లాల్, బాలాజీ, చల పతిరావు, వెంకటేశ్, బ్రాహ్మణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు, నవబంరు 9: (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిర్వహిస్తున్న ప్రజాపోరును జయప్రదం చేయాలని రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి శనివారం అన్నారు. తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 14న జరిగే ధర్నాలో పాల్గొనాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పెంచిన ట్రూఅప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు అప్పుగా కాకుండా కేంద్రం ప్రభుత్వం వెంటనే గ్రాంట్‌ను ఇవ్వాలని కోరారు. ఉచిత ఇసుక విధానం సరిగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజధాని సీపీఎం నాయకులు కుంభ ఆంజనేయులు, పేరం బాబు, జీ నాగేశ్వరరావు, షేక్ జాని, పి.వెంకటేశ్వరరావు, స్టాలిన్, గరటయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని తుళ్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స

- ఓహాయో వర్శిటీ ప్రొఫెసర్ ఎం చంద్రశేఖర్

గుంటూరు(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సరైన ఔషధ వినియోగంతో హాస్పిటల్ వ్యయాన్ని తగ్గించి, రోగులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించవచ్చని యూఎస్ ఏలోని ఓహాయో వర్శిటీ ఆఫ్ ఫిండ్లే ప్రొఫెసర్ ఎం చంద్రశేఖర్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అవి నిడ ఇన్నోవేషన్స్ సంయక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. క్లినికల్ ఫార్మసీ అనేది వైద్యరంగంలో రోగులకు సమర్థవంతమైన ఔషధ చికిత్స అందించడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. ఫార్మసీ నిపుణులు వైద్యులతో కలిసి పనిచేస్తే రోగులకు సరైన మందులు ఇవ్వడం సాధ్యమన్నారు. క్లినికల్ ఫార్మసీ సేవలు వైద్య రంగంలో రోగులకు ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మరోఅతిథి డాక్టర్ కార్తీక్ రాకమ్, డాక్టర్ చింతమనేని మీన పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్ష శిబిరంలో శనివారం ప్రజాపోరు మొదలైంది. కార్మికులు చేస్తున్న న్యాయమైన దీక్షకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ సరైన ఉపాధి లేక సామాన్య ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గడం లేదని దుయ్యబట్టారు. ఈ నెల 14న తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధరలు తగ్గించాలని జరిగే సీపీఎం ప్రజా పోరుకు తరలిరావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కొట్టే కరుణాకర్, యహోషువ, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, బి.అంకయ్య, సుబ్బారావు, శారద, ఇమాంబి, సాంబయ్య నాయక్, ఎంఎల్ నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం కేంద్ర కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం జాతీయ అధ్యక్షుడు మురళీకృష్ణ

మంగళగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రత్నాలచెరువు బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కాపు సంఘం కేంద్ర కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాపుల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా కాపు సంఘం పనిచేస్తుందన్నారు. కాపు సంఘాలన్నింటినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి 7 శాతం రిజర్వేషన్లను అమలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. అమరావతిలో కాపులకు 5 ఎకరాల భూమిని కేటాయించాలని, ముద్రగడ క్రాంతికి జనసేన రాజమండ్రి మేయర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నేతలు తోట సాంబశివరావు, ముద్రగడ క్రాంతి, ఆకుల జయసత్య, యడ్ల సాయికృష్ణ, పోరుమామిళ్ల ఈశ్వర్, కూనపురెడ్డి రమేష్, యర్రంశెట్టి అంజిబాబు, పెన్నిలి దామోదరరావు, తిరుమలశెట్టి కొండలరావు, పొన్నూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి తగిన గౌరవం టీడీపీలోనే

- డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి అంకితభావంతో పని చేసే వారికి తగిన ప్రాధాన్యం, సముచిత స్థానం తెలుగుదేశంలోనే దక్కుతుందని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరులోని నగర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో పని చేస్తే ఎవరికైనా సరే తనకు లాగే ఊహించని పరిణామంతో పదవులు రావచ్చని చెప్పారు. సర్పంచ్ స్థాయి నుంచి ఈ స్థాయికి చేరుకుంటానని అసలు ఊహించలేదని, టీవీలో తన పేరు వస్తుండడం చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. చంద్రబాబుని నమ్ముకుని పార్టీ కోసం పనిచేస్తే ప్రతి ఒక్క నాయకుడికి న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కష్టకాలంలో అండగా ఉండి ప్రజల్లో మమేకమై పనిచేస్తారో వారిని పార్టీ ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందన్నారు. తనకు ఈ పదవి దక్కడం కోసం ప్రత్యేకంగా పరోక్షంగా కృషి చేసిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు, సహకరించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

చిల్లపల్లి శ్రీనివాసరావుకు సముచిత స్థానం

మంగళగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన రెండో విడత నామినేటెడ్ పోస్టుల్లో మంగళగిరికి చెందిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, చేనేత వికాస విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావుకు సముచిత స్థానం లభించింది. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా చిల్లపల్లిని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జనసేన ఆవిర్భావం నుంచి చిల్లపల్లి శ్రీనివాసరావు పార్టీకి అంకితభావంతో సేవలందించారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కేడర్‌ను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి సమర్థవంతంగా పని చేశారు. మంగళగిరిలో నారా లోకేశ్ భారీ సాధించడంలో జనసేన తరఫున విశేషంగా కృషి చేశారు. చిల్లపల్లి సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం రెండో విడత నామినేటెడ్ పోస్టుల్లో మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమించి తగిన విధంగా గౌరవించింది. కాగా, తనకు చైర్మన్ పదవిని కేటాయించడంపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి చిల్లపల్లి కృతజ్ఞతలు తెలిపారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన చిల్లపల్లి శ్రీనివాసరావు

పీహెచ్‌సీలో పల్నాడు డీఎంహెచ్‌వో రవి విచారణ

కాకుమాను, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పల్నాడు డీఎంహెచ్‌వో బి.రవి తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల ప్రకారం కాకుమాను పీహెచ్‌సీ తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ రత్న ప్రసాద్‌పై కొమ్మూరుకు చెందిన ఖుద్దూస్ మరికొంత మంది రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేశారు. హాస్పిటల్‌లో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, సమయపాలన పాటించకపోవడం, పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్ ఫ్లారెన్స్ నైటింగేల్, అలాగే మోహన్‌లు సుదీర్ఘకాలంగా ఇక్కడే విధులు నిర్వహించడం వంటి అంశాలపై విచారణ నిర్వహించినట్లు విచారణాధికారి, పల్నాడు డీఎంహెచ్‌వో రవి తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు.



ఫిర్యాదుదారుడు ఖుద్దూస్ నుంచి వివరాలు సేకరిస్తున్న పల్నాడు డీఎంహెచ్‌వో రవి

పంటల సాగులో రైతుల శ్రమ వెలకట్టలేనిది

- బాపట్ల అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు



లేమల్లెపాడు గ్రామ స్వరూపాన్ని రంగ వల్లులతో తీర్చిదిద్దిన అగ్రికల్చర్ విద్యార్థులు

వట్టిచెరుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యను అభ్యసిస్తూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లేమల్లెపాడు గ్రామంలో నెల రోజులుగా క్షేత్ర స్థాయిలో అధ్యయనంలో భాగంగా రైతులను కలసి విద్యార్థులు తెలుసుకుంటున్నారు. నిత్యం రైతులతో పాటు విద్యార్థులు ప్రస్తుతం సాగులో ఉన్న పంటల పరిస్థితి, ప్రస్తుతం మిర్చి, వరి సాగులో ఎదురవుతున్న ఆర్థికపరమైన పంటల స్థితిగతులను రైతుల నుంచి తెలుసుకుంటున్నారు. అలాగే పంటల ఉత్పత్తిని సాధించేందుకు తీసుకుంటున్న రక్షణ చర్యలను, క్షేత్ర స్థాయిలో రైతుల అనుభవాలను తెలుసుకుంటున్నారు. గ్రామంలోని రామాలయం వద్ద శనివారం గ్రామ స్వరూపాన్ని రంగ వల్లులతో తీర్చిదిద్దటాన్ని గ్రామస్థులు, మహిళలు ఆసక్తిగా తిలకించారు. రైతులు తమ అనుభవాలను జోడిస్తూ వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపైన దృష్టి పెట్టాలని శాస్త్రవేత్త సూచనలు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.


స్టార్ విద్యార్థులకు వీఐటీ ల్యాప్‌టాప్‌లు పంపిణీ



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేసిన కార్యక్రమంలో వీఐటీ యాజమాన్య సిబ్బంది

తుళ్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)విద్యార్థులకు శనివారం ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయం స్టార్స్ ప్రోగ్రాం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందేనని వైస్ ప్రెసిడెంట్ శంకర విశ్వనాథన్ తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను (26 జిల్లాల్లో నుంచి ఒక విద్యార్థి, విద్యార్థిని) ఎంపిక చేసి వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఎస్వీపీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి, స్టార్స్ కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్స్ జాన్ ప్రదీప్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌కు నిధులు కేటాయించాలి



సీపీఎం ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కాకుమాను, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించడానికి అవసరమైన నిధులను వెంటనే కేటాయింపు చేసి పనులను ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కాకుమాను, కొమ్మూరు, పెద్దివారిపాలెం, కొండపాటూరు గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ కాకుమాను మండలంలో ఎరువుల కొరత ప్రధానంగా రైతులను వేధిస్తుందని ఆవేదనవ్యక్తం చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.6072 కోట్లు ప్రజల మీద భారం వేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 14న ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జంపని రామారావు, ఎం వెంకటేశ్వర్లు, ఎస్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలు కార్పొరేట్‌కు ధారాదత్తం చేస్తున్న బీజేపీ

దుగ్గిరాల, నవంబరు 9 : దేశంలో బీజేపీ మూడో పర్యాయం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నియంత్రణలేక ప్రజలు అలమటిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15న మండల కేంద్రాల్లో ప్రజాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాలరాజు తెలిపారు. సీపీఎం నాయకులతో కలిసి ప్రజాధర్నా కరపత్రాలను గ్రామస్థులకు శనివారం అందించి ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, ఇందిర, బుల్లిబాబు, చిరంజీవి, లలిత, కోటమ్మ, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు నగరం, బ్రాడీపేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ, మెలోడీ వాయిస్ క్లినిక్‌లో 18వ జాతీయ ఫోనో సర్జరీ వైద్య సదస్సు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫోనో సర్జన్, సదస్సు నిర్వాహకులు డాక్టర్ వీ ఫణీంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థిని చంద్రికను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైని, అరుణ సుజాత

జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంకి

జేఎంజే విద్యార్థిని ఎంపిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాదులోని జేఎంజే కళాశాలలో శనివారం జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంకి ఎన్నికైన విద్యార్థిని జి.చంద్రికను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12న నుంచి మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగే జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ ఆర్‌డి క్యాంపునకు తమ కళాశాల తృతీయ సంవత్సరం బీకాం విద్యార్థిని జి.చంద్రిక ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితీ కార్యాలయం వద్ద శనివారం ఎస్‌వీ యోగా సభ్యులు కన్నెగంటి నంద కిషోర్ కుమార్, బేబి గంగా దంపతుల కుమార్తె ఆధ్యశ్రీ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. పసుపులేటి మాణిక్యారావు, సావిత్రి, కుర్రా శ్రీను, అన్నదాన సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

కులగణనకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో కులగణన చేసేందుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. 139 బీసీ కులాల సంక్షేమానికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అందించాలంటే కులాల వారీగా గణన అవసరమన్నారు. తెలంగాణలో సమగ్ర కులగణనపై హైకోర్టు ఆదేశాల మేరకు కమిషన్ నియామకం చేశారని చెప్పారు. కానీ రాష్ట్రంలో కులగణన విషయమై పట్టించుకోకపోవడం తగదన్నారు. కులగణనలో ప్రతి ఒక్కరి ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగం వంటి అన్ని వివరాలతో సమాచారం సేకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసేందుకు కూడా సమగ్ర కులగణన దోహదపడుతుందని కేసన శంకరరావు తెలిపారు.



వన సమారాధన సందర్భంగా సత్యన్నారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న పండితులు

బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో

వన సమారాధన

కొల్లిపర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల పరిధిలోని వల్లభాపురం కృష్ణానది తీరాన శనివారం బ్రాహ్మణ వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనసమారాధన కార్యక్రమంలో 300 మంది పైగా పాల్గొన్నారు. పండితులు సత్యన్నారాయణ వ్రతాన్ని నిర్వహించి కార్తీక మాసం విశిష్టతను వివరించారు. అనంతరం పలు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు పోగుల రామలింగేశ్వరశర్మ, ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వీరభద్రరావు, కోశాధికారి సూర్యనారాయణ శాస్త్రీ, బ్రాహ్మణ సంఘ నాయకులు జగన్నాథాచార్యులు, జనార్దన్ భట్టార్, రమణశర్మ, భోగేశ్వరరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్‌ను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

● దోమలకు ఆవాసాలుగా...
● విషపురుగులకు నిలయాలుగా..
● అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు
● మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



అమరావతి ప్లాట్స్‌లో మురుగు నీరు



మారీసుపేటలో పిచ్చిమొక్కలతో ఖాళీ స్థలం

తెనాలి, మారీసుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరిగి ఆ స్థలాలు జంగిల్‌ను తలపిస్తున్నాయి. మరి ముఖ్యంగా చెంచుపేటలోని అమరావతి ప్లాట్స్‌లోని నివేశన గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు స్థల యజమానుల నిర్లక్ష్యంతో పిచ్చి మొక్కలు పెరిగి వాటిలో విష పురుగులు, పాములకు ఆవాసాలుగా మారాయని తమ ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. అవి ఎవరిని కాటువేస్తాయోనని భయం భయంగా జీవనం సాగిస్తున్నామని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఖాళీ స్థలాలలో వ్యర్థాలను, చెత్తను వేయడం వలన అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుంది. ఆ వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లడంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. వర్షపు నీరు నిలువ ఉన్న కొన్ని ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారాయని, ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ముఖ్యంగా విష జ్వరాల బారిన పడుతున్నారని ప్రజా సంఘ నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు పట్టణంలో అపరి శుభ్రమైన పరిసరాలను గుర్తించి, ఆ ఖాళీ స్థల యజమానులతో మాట్లాడి ఆయా స్థలాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పురపాలక సంఘ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.



అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

అనారోగ్య బాధితులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చేయించుకోలేని వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరుకి చెందిన నన్నపనేని శ్రీనివాసరావుకు వైద్య ఖర్చు కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 5 లక్షల చెక్కును శనివారం ఆయనకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ పథకం పరిధిలోకి రాని వ్యాధులకు సంబంధించి వైద్యం చేయించుకోవాలంటే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తునట్లు చెప్పారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

చేబ్రోలు, (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు కారుమూరి శివరత్నం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలోని శివరత్నం గృహానికి ఎమ్మెల్యే వెళ్లారు. శివరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ బయోపిక్ సన్నివేశాల్లో ఎమ్మెల్యేలు



బయోపిక్ సన్నివేశాలకు క్లాప్ కొడుతున్న పార్వతీ పురం ఎమ్మెల్యే విజయచంద్ర

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్ రామ్ బయోపిక్ సన్నివేశాల్లో ఎమ్మెల్యేలు నటించారు. తెనాలికి చెందిన సినీ దర్శకుడు దిలీప్‌రాజా ఈ బయోపిక్‌ను తీస్తున్నారు. 2వ షెడ్యూల్ షూటింగ్‌ను శనివారం సుల్తానాబాద్‌లోని రత్నా ప్యార్ట్యాన్ కల్యాణ మండపంలో వేసిన సినిమా సెట్‌లో చిత్రీకరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ పాత్రలో నటించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సన్నివేశాల ప్రారంభంలో పాల్గొన్నారు. వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ దళితజాతి ముద్దుబిడ్డగా, ఎన్నో శాఖలకు కేంద్ర మంత్రిగా పని చేసిన జగ్జీవన్‌రామ్ చరిత్రను తెరకెక్కించడం ముదావహమన్నారు. సీనియర్ నటులు నరసింహరాజు, వెంకటస్వామి, కావ్య, అరవింద రాజా సన్నివేశాల్లో పాల్గొన్నారు. మురళీకృష్ణ, కెమెరామెన్ వంశీ, రత్నాకర్, శ్రీకాంత్, జనార్దన్, మణి పర్యవేక్షించారు.

అందరికీ సమన్యాయమే ప్రధాన ధ్యేయం

● న్యాయాధికారి పవన్‌కుమార్

తెనాలి క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు పేద, ధనిక, తారతమ్యం లేకుండా అందరికీ సమన్యాయం అందించాలన్నదే న్యాయ వ్యవస్థల ప్రధాన ధ్యేయమని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ.పవన్‌కుమార్ తెలిపారు. శనివారం జాతీయ న్యాయ సేవల అధికార దినోత్సవం సందర్భంగా అంగలకుదురులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు న్యాయమూర్తి పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. న్యాయ సేవల చట్టం నవంబర్ 9 1987లో ఆమోదించబడి, 1995 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. జాతీయ న్యాయ సంస్థల ద్వారా పేదలు, మహిళలు, విద్యార్థులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. న్యాయ సహాయం పొందాలనుకునేవారు టోల్ ఫ్రీ నం.15100 సంప్రదించవచ్చునని, ప్రత్యేక యాప్ ద్వారా సమస్యలు తెలుపుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, పారాలీగల్ కమిటీ పర్యవేక్షులు షేక్ మహబూబ్, యర్రంశెట్టి అనిల్, సరోజని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి పవన్‌కుమార్



దర్శనానికి బారులు తీరిన భక్తులు

వైకుంఠపురంలో భక్తుల రద్దీ

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం వైకుంఠపురం ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ తగ్గలేదు. మొక్కుబడులు చెల్లించే భక్తులు, దర్శనానికి వచ్చే వారి వాహనాలు ఆవరణతో పాటు ప్రధాన రహదారిపై కూడా పార్కింగ్ చేయాల్సి వచ్చింది. భక్తులకు త్వరితగతిన దర్శనం జరిగేలా దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

16న ఎమ్మార్పీఎస్ సభను

జయప్రదం చేయండి

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 16న జరగనున్న ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజు కోరారు. గంగానమ్మపేట కార్యాలయంలో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. మాదిగ ప్రజల కోసం అమరులైన జాతి ముద్దులను స్మరించుకుందామని చెప్పారు. విజయవాడ గాంధీనగర్ ఫిల్మ్ చాంబర్‌లో సభ జరుగుతుందన్నారు. కొమరాల శ్రీనివాస్, యేటుకూరి విజయ్, భూషణం, ఇస్రాయేలు, బుజ్జిబాబు, సురేష్, రవి, శ్రీను, రమణమూర్తి పాల్గొన్నారు.



అనుమతులేని నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

తెనాలి, మారీసుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పురపాలక సంఘ పరిధిలో అనుమతులేని భవన నిర్మాణాలను కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తపేటలో శనివారం అనుమతులు లేని భవన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి సాంబశివరావు పరిశీలించారు. అనుమతులు లేని ఫ్లోర్ స్లాబ్‌లను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో నూతన భవన నిర్మాణాలకు త్రీ టు జీ+2 వరకు మాత్రమే అనుమతులు ఉంటాయని అంతకంటే ఎక్కువ ఫ్లోర్ల భవన నిర్మాణాలకు సీఆర్‌డీఏ అనుమతులు కావాలని తెలిపారు. భవన యజమానులు ఎవరూ టౌన్ ప్లానింగ్ అనుమతులకు విరుద్ధంగా నిర్మించరాదన్నారు. అతిక్రమించి నిర్మిస్తే పురపాలక సంఘం చట్టం ప్రకారం ఆ నిర్మాణాలను తొలగిస్తామని టీపీవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, చైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికాసానికి

క్రీడలు దోహదం

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని సెయింట్ జాన్స్ స్కూల్ కరస్పాండెంట్ సూరజ్‌మోహన్ చెప్పారు. నాజరుపేటలోని పాఠశాలలో శనివారం 2కె రన్, 5కె రన్, 10కె రన్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆటల్లో కూడా ప్రావీణ్యం ఉండాలన్నారు. పరుగు, నడక ప్రతి మనిషికి ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. వయసుతో నిమిత్తంలేకుండా విద్యార్థులతో పాటు నడిచిన తల్లిదండ్రులను అభినందించారు. రన్‌లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. డైరెక్టర్ అరుణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ వెంకటాచలం





ఎక్సైజ్ సీఐ వెంకటాచలం

తెనాలి క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మద్యం ప్రియులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇలాంటి సమయంలో శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో తెనాలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వెంకటాచలం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్ర: కొందరు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. మహిళలు, విద్యార్థినులకు సమస్యగా మారింది. దీనిని ఎలా కట్టడి చేస్తారు?

జ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం. మద్యం తాగి మహిళలను, విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తుంటే వెంటనే గుంటూరులోని ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్ నం.0863-2233576కు, తెనాలి ఎక్సైజ్ శాఖ నం. 9440902474కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్ర: మద్యం షాపులు దక్కించుకున్న వారు అధిక లాభాలు, అమ్మకాల కోసం కావాలనే గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జ: మద్యం షాపుల నిర్వాహకులు గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తే పట్టుబడిన వారిపై మొదటి తప్పుగా రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తాం. అదే షాపు నుంచి 2వ వారి కూడా ఇలాంటి సంఘటన జరిగితే లైసెన్సులు రద్దుతోపాటు బైడంవర్ కేసు నమోదు చేస్తాం.

ప్ర: ఒక వ్యక్తి ఎన్ని మద్యం బాటిళ్లు కలిగి ఉండవచ్చు.

జ: మద్యం కొనుగోలుదారుడు మూడు మద్యం బాటిళ్ల వరకు కలిగి ఉండాలి. అంతకు మించి ఉంటే కేసు నమోదు చేస్తాం.

ప్ర: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే ఏం చర్యలు తీసుకుంటారు.

జ : ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే రూ. 5 లక్షల వరకు అపరాధ రుసుం విధిస్తాం.

ప్ర: జాతరలు, కొలుపులు, ఉత్సవాలు సమయంలో బహిరంగంగానే మద్యం తాగి ఘర్షణలకు దిగుతున్నారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

జ: ఇలాంటి సందర్భాల్లో ఎక్సైజ్‌శాఖ, పోలీసు శాఖ వారి నిఘా ఉంటుంది. మద్యం తాగిన వారు మితిమీరి వ్యవహరిస్తుంటే కఠినంగా వ్యవహరిస్తాం. ఫోన్ ద్వారా సమాచారం తెలిపినా చర్యలు తీసుకుంటాం.



దోమల నివారణ కెమికల్స్ పిచికారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

పొన్నూరుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాధికారక దోమల నివారణకు ప్రత్యేక చర్యలు అవలంభిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలో శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైయిన్‌ను నిర్వహించారు. జీబీసీ రోడ్డులో ఫాగింగ్ నిర్వహించారు. మురుగు కాల్వలో దోమల నివారణకు మలాథిన్ మందును చల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల ఉధృతి ద్వారా ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది రమేష్‌ను అభినందిస్తున్న ప్రజా సంఘాల నేతలు

పేదలకు అండగా నిలవాలి

పొన్నూరుటౌన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు అండగా నిలవాలని స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది, ప్రజా సంఘాల నాయకులు కోరారు. మానవ హక్కుల వేదిక కార్యాలయంలో శనివారం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది తూమాటి రమేష్‌ను అంబేద్కర్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ టీ రాజారావు, జీఎస్ రాయల్, ఎం సునీల్, ఏ మురళీకృష్ణ, టీ ఆనందబాబు, బీ ప్రకాష్, బీశ్యామ్, టీ నాగేశ్వరరావు, కే రమేష్, బీ హేమలత, కే శ్రీనివాస్, కే విజయ్, పీ సుధాకర్, బీ వెంటకేశ్వర్లు పాల్గొన్నారు.



కొల్లిపరలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

బీపీ, షుగర్ నుంచి తగిన జాగ్రత్త అవసరం

కొల్లిపర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీపీ, షుగర్ విషయంలో తగిన జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి ఎస్. సుమంత్ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర ఆరిమండవారి కల్యాణ మండపంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. వైద్యులు సలహాలు, సూచనలు మేరకు మందులు వాడుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహించు ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్లి వైద్యం చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుస్మితా, ఏఎన్ఎమ్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు జయప్రద, మల్లేశ్వరి, భవాని, విజయకుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'అరవింద' వ్యవస్థాపకుడు గుళ్లపల్లికి నివాళి

తెనాలి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాజరుపేటలోని అరవింద విద్యా కేంద్రం వ్యవస్థాపకులు గుళ్లపల్లి సత్యనారాయణకు నివాళులర్పించారు. శనివారం ఆయన 33వ వర్ధంతి పురస్కరించుకుని విద్యా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి విద్యా శంకర్ మాట్లాడుతూ అరవింద సొసైటీ స్థాపించడం వలన ఎంతోమంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు దోహదపడిందన్నారు. డాక్టర్ తాడిబోయిన అనూష, భాషా, రామరాజు, ఆంజనేయులు, డైరెక్టర్ సంపూర్ణ తదితరులు ప్రసంగించారు. విద్యాకేంద్రం స్థాపనకు కృషి చేసిన ఎన్నారై పద్మారాణి, కొడాలి సుదర్శనబాబులకు నివాళులర్పించారు.

ప్రజా సమస్యలపై సీపీఎం 'ప్రజా పోరు'

పొన్నూరుటౌన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజా పోరు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకుడు నిమ్మకూరి రమేష్‌బాబు తెలిపారు. ప్రజా సమస్యలపై ముద్రించిన కరపత్రాలను పొన్నూరులో సీపీఎం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఈ నెల 15న గుంటూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలిందిగా కోరారు. వైసీపీ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ. 6702 కోట్ల అదనపు భారాన్ని ప్రజల నుంచి వసూళ్లు చేయాలని చూడటం సరికాదని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నాయకులు నేడు వాటిని ఏర్పాటు చేయించడం ప్రజలను వంచించడమేనని విమర్శించారు. కూటమి పార్టీల ఎన్నికల హామీ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు తక్షణమే రూ. 20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు దారు చట్టం ఉపసేలేదని, సూపర్ 6 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీరుపైనా వారు విమర్శలు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటం, క్రూడ్ ఆయిల్ ధరలు అంతర్జాతీయంగా తగ్గితే దేశంలో మాత్రం వాటి ధరలు తగ్గించలేదని విమర్శించారు. నిరుద్యోగ సమస్య, కార్పొరేట్ సంస్థలకే రుణమాఫీ అమలు చేస్తుండటం, ఒకే బాషా, ఒకేచట్టం, ఒకేఎన్నిక, జమిలి ఎన్నికలు మొదలైన అంశాలపై వారు విమర్శించారు. కార్యక్రమంలో నేతలు బ్రహ్మచారి, ఆంటోని, శెల్వంరాజు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సెలవుల్లో తరగతుల నిర్వహణ అన్యాయం

● ఆయా కళాశాలపై చర్యలు తీసుకోవాలి
● ఏఐఎస్ఎఫ్ నేతల డిమాండ్
● పట్టణంలోని ఓ కళాశాల వద్ద ఆందోళన

తెనాలి, మారీసుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ డిమాండ్ చేశాడు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాల వద్ద శనివారం విద్యార్థులకు సెలవు రోజు అయినప్పటికీ తరగతులను నిర్వహించడాన్ని నిరసిస్తు కళాశాల వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తరగతులను నిర్వహించడం అన్యాయమన్నారు. అధికారులు స్పందించి ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామనిహెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, నియోజకవర్గ కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షుడు దినేష్, సహాయ కార్యదర్శి సన్నీ, జయదీప్, పండు, ప్రభాస్, అఖిల్, హేమంత్, జయరాం పాల్గొన్నారు.



కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు